# చిదంబర రహస్యం

చిదంబరరావుకు అద్భుత శక్తులున్నాయనీ సాయంత్రమైతేచాలు అశోకవర్థన హాస్టల్‌లో ఒక్క 'లా' స్టూడెంటూ ఉండడనీ అంతా అప్‌లాండ్స్‌లో నరసంచారానికి దూరంగా వెళ్లి పోతారనీ విని ఆశ్చర్యపడ్డాను. నాకెందుకో ఈ మంత్ర తంత్రాల మీదా, మానవాతీత శక్తులమీదా అంతనమ్మకం లేదు. ఇవన్నీ ఏవో పల్లెటూళ్ళలో విద్యా సంస్కారం అంతగాలేనివాళ్ళు నమ్మే విషయాలేనని నేననుకుంటూ వుండేవాడిని. కాని ఇప్పుడిలా విశ్వ విద్యాలయంలో చదివే మేధావులంతా కూడా నమ్ముతున్నారంటే నాకూ నమ్మక తప్పలేదు. నూటికి తొంభై మంది నమ్ముతుంటే నేనొక్కడినీ నమ్మకుండా ఎలా వుండటం?

చిదంబరరావును గురించి విన్నవిషయాలు సామాన్యమైననికాదు. అతడు 'బాణావతి' అనే పేరుగల భూతవైద్యం చేస్తాడు. జాలారిపేటలో కొన్ని దయ్యాలను పట్టి సముద్రంలో కలిపేశాడు. పీతలవానిపాలెంలో ఒక జాలరికి బంగారపు చేపను నీళ్ళల్లో నుండి తీసియిచ్చాడు! ఆ చేప ముందు మానవభాషలో మాట్లాడిందట. తరువాత విలవిలలాడి కిందపడి పోయింది. కరిగిస్తే చేప మొత్తం బంగారమే?॥

చిదంబరరావుకు వశీకరణ శక్తులున్నాయి. ఏ విద్యార్థినయినాసరే చూపులతోనే ఆకర్షించగలడు. అతడు చిరునవ్వు నవ్వితేచాలు ఆడపిల్లలంతా ముఖాలను హారతి పళ్లాలలా చేసుకొని నిలబడతారు. అతనంటే యూనివర్సిటీ ప్రొఫెసర్సుకు కూడా గౌరవమే. ఫలానా ప్రొఫెసర్‌కు ఫలానా దేశం నుండి ఆహ్వానం వస్తుందని జోస్యం చెపుతాడు. అంతే! నెలతిరక్కుండా, వచ్చి తీరాల్సిందే! 'నీవు ఇన్నాళ్ళల్లో రీడరువు కాబోతున్నావ'ని చెబుతాడు - అలా జరిగితీరాల్సిందే!! 'ఫలానా ప్రొఫెసరుకు అంగారక గ్రహంబాగాలేదు-ఈ గండం గడవటం కష్టం' అనిచెపుతాడు. చెప్పిన తేదీ మళ్ళీ వచ్చేలోపలే ఆయన గుండెపోటుతో 'హరీ' మనడం నాకూ తెలిసిన విషయమే! ఇక నమ్మకుండా వుండటం ఎలా?

ఇంత జరిగినా సరే, నా జన్మ సంస్కారాల ఫలితంగానో ఏమో మరి ఇదంతా చిదంబర రహస్యమేననిపించింది. వాడేదో మోసంచేస్తున్నాడనిపించింది. సామాన్య జనులనేకాదు విద్యావంతులనే బోల్తా కొట్టిస్తున్నాడనితోచింది. ఇది ఎలాగైనా సరే నిరూపించాలి. నలుగురిలోనూ చిదంబరరావు గుట్టు రట్టుచేసి నవ్వులపాలు చేయాలి అప్పుడే నాకు రిలీఫ్.-ఈ నిశ్చయం బాగానేవుంది మరి నిరూపించడం ఎలా? నామటుకునాకే ఇంకా పూర్తిగా సంశయనివృత్తికాకపోయె. ఎలా చిదంబరరావు దగాకోరని ఇతరులచేత నమ్మించడం??

పులిమీద పుట్ర అన్నట్లు నా క్లాస్‌మేట్ రాజేంద్ర చెప్పిన విషయం నాలో ఇంకా భయాన్ని రేకెత్తించింది. చిదంబరరావు మోసగాడని నిరూపించే ఉద్దేశంతో ముగ్గురు లాస్టూడెంట్స్ అతనిపై గూఢచారి చర్యలు మొదలు పెట్టారట. వాడిఅంతుతేలుస్తాము.-ఈ బి. సి. నాటి మూఢ నమ్మకాలతో పవిత్ర విశ్వవిద్యాలయ ఆవరణాన్ని అపవిత్రం చేస్తున్నాడు' అని హేతువాదంతో పురోగమించారట. నీడలా చిదంబరరావును అనుసరించారట.

అది చిదంబరరావుకు తెలిసింది. ఆయనేమీ అనలేదు. కేవలం ఒక చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు. 'వాళ్ళనలా వదిలేశారేం' అని చిదంబరరావు భక్తులు ఎవరో అంటే 'పోనిద్దూ మతిలేని వెధవలు వాళ్ళతో మనకెందుకు' అన్నాడట. అంతే! అని, వారం తిరగలేదు. ఆయన మాట మంత్రమై పారింది వేములవాడ భీమకవి కున్నట్లు వాక్శుద్ధి వున్నదో ఏమో మరి ఆ ముగ్గురు స్టూడెంట్స్‌కూ మతిచలించింది. రాత్రికి రాత్రే వాళ్ళను యూనివర్సిటీ గోడ అవతలకి చేర్పించవలసివచ్చింది. కాంపౌండ్ కవతల సుప్రసిద్ధమైన పిచ్చి ఆసుపత్రి వున్నది వాళ్ళనక్కడ వదిలేయక తప్పలేదు!!

దీనితో నేను నా ప్రయత్నాన్ని దాదాపు విరమించుకున్నట్లేలెక్క, చిదంబరరావు ఏమైతే ఎవడికి కావాలి? నేను మా అమ్మా-నాయనలకు ఒక్కడే బిడ్డణ్ణి. వెనకాల పెద్ద ఆస్తిపాస్తులూలేవు. రెక్కల కష్టంమీద చదివిస్తున్నారు. అనవసరంగా ఇప్పుడు నాకు మతి చలిస్తే వాళ్ళగతేంకాను? ఈ చిదంబరరావు గొడవతో నాకేమిపని? నేనిక్కడికి వచ్చింది ఎం. ఎస్. సి. లో ఫస్టుక్లాసు సంపాదించుకొని వెళ్ళడానికి. అదితప్ప ఇంకొక ధ్యాస నాకెందుకు?

ఇలా అనుకొని చిదంబరరావు గూర్చి ఇక ఆలోచించడం మానివేశాను.

ఆ రోజు సాయంత్రం నేను సముద్రం ఒడ్డుకు వెళ్ళాను. కెరటాలు ఎగిరెగిరి తీరానవున్న బండ రాళ్ళకు కొట్టుకుంటున్నవి నామనస్సులాగా. రంగు రంగుల గవ్వలేరుకుంటూ ముందుకు సాగిపోతున్న నన్ను ఎవరో పేరు పెట్టి పిలిచినట్లనిపించింది.

'కిరణ్ కుమార్! ఓయ్ కిరణ్ కుమార్'

వెనుదిరిగి చూచాను.

దూరంగా చిదంబరరావు!!

ఉలిక్కిపడ్డాను.

చిదంబరరావు ఒంటరిగా సముద్రం ఒడ్డున కూర్చొని వున్నాడు ఆయనను చూడగానే నాకెందుకో గుండెదడదడ కొట్టుకున్నది.కాలు బలహీనంగా అయి పోయి నేలమీద గట్టిగా మోపి నిలబడలేక పోతున్నట్లు అనిపించింది.

దూరం నుంచి చిదంబరరావు నన్ను రమ్మని చెయ్యి వూపుతున్నాడు.

యాంత్రికంగా చిదంబరరావు వైపు నడిచాను.

కాళ్ళలో సత్తువలేదు-కళ్ళల్లో చైతన్యం లేదు.

ఏదో "దంష్ట్రా కరాళుడి విషజిహ్వల పైకి" నడిచి పోతున్నట్లని పించింది.

ఎలావెళ్ళానో నాకే తెలియదు-

వెళ్ళి చిదంబరరావు కెదురుగా నిలబడ్డాను.

చిదంబరరావు నన్ను చూచి నవ్వాడు-

నవ్వాడు!!

ఇంకేం నాపనీ అయిందన్నమాటేనా?

నాకు ఏడుపు వచ్చింది-

ఏడ్చానా??

మరీ పసిపిల్లవాణ్ణి కాదుకదా పెద్దగా ఏవ్వడానికి- ఎం. ఎస్‌సి. చదువు తున్న వాణ్ణి-ఎదిగినవాణ్ణి-సభ్యసమాజ లక్షణాలు పట్టుపడ్డవాణ్ణి-అందుకే లోలోపలే ఏడ్చాను.

'కూర్చొండి కిరణ్‌కుమార్, నిలబడ్డారేం'

ఆ మాటలు చాలా ప్రశాంతంగా వున్నాయి. మంత్రరుద్ధ భుజంగంలా ఆయన ఎదుట కూర్చున్నాను. చిదంబరరావు ముఖంలో ఏదో విలక్షణమైన కాంతి ఉంది. మాటల్లో ఏదో సమ్మోహన శక్తి వుంది.

'షికారుకు వచ్చినట్లున్నారు'

'అవును'.ఆయన కళ్ళల్లోకి చూస్తూ అన్నాను.

'ఇవ్వాళ సముద్రం ఎందుకో ఎర్రగా వుంది'

'అవునండీ'

'కిరణ్ కుమార్! నీకు ప్రకృతి అంటే ఇష్టమేనా'

ఇష్టమోకాదో నేనెప్పుడూ ఆలోచించలేదు. తిండి గూర్చి. గుడ్డ గూర్చి, డిగ్రీలగూర్చి ఆలోచించానే కాని ప్రకృతి ఇష్టమూకాదా అని ఎప్పుడాలోచించాను? ఎందుకాలోచించాలి??

'నీవు పుట్టిన కొల్లేరు చుట్టుపక్కల అంతా ఎంతో ప్రకృతి మనోహరంగా వుంటుంది కదయ్యా. విశ్వనాథ సత్యనారాయణగారి హృదయం ఉప్పొంగి ఋతుసంహారం అనే పుస్తకం కూడా వ్రాశాడుకదా, ఆ సౌందర్యం చూచి. శరత్కాలంలో అక్కడి కొంగలు పైకెగరడంపై అందమైన సీస పద్యాలు వ్రాశాడు' నేను స్తభించిపోయాను- ఆయనకున్న సాహిత్య పరిచయానికి కాదు, నాది కొల్లేరు దగ్గర గ్రామమని ఈయనకెలా తెలుసు?? నా పుట్టు పూర్వోత్త రాలూ జాతకమూ మొత్తం ఫైలులో పెట్టుకున్నాడా ఏమిటి??

ఆయనే మళ్ళీ అన్నాడు 'చూడు కిరణ్ నువ్వు విజయవాడలో బి ఎస్‌సి. ఫస్టుక్లాసులో పాసైనావు-గోల్డ్ మెడల్ కూడా సంపాదించావు. నిజమేకాని చదువంటే పుస్తకాలేనా? గ్రంథాలకు ఇవతల చాలా ప్రపంచం వుంది. అందులో చదువవలసిన విషయాలూ నేర్చుకోవలసిన పాఠాలూ గుణపాఠాలూ ఎన్నో వున్నాయి'

సందేహం లేదు-నా చదువు సంధ్యలూ గోల్డ్ మెడల్ రావడమూ మొత్తం ఈయనకు తెలుసు.

అకస్మాత్తుగా రెండు చేతులతోనూ చిదంబరరావు పాదాలు ముట్టి కళ్ళ కద్దుకున్నాను-

'ఇదేమిటి? నీకేమన్నా పిచ్చా? నాకు దణ్ణం పెడతావేమయ్యా.'

'చిదంబరరావుగారూ మీరు సాక్షాత్తు దైవాంశ సంభూతులు-ఇన్నాళ్లూ వాళ్లూ వీళ్లూ చెపుతూంటే నమ్మకం కుదరలేదు.'

'దైవంలేదూ అంశంలేదూ కిరణ్-అంతా తమాషా-నీ మిత్రులు చాలా మంది నాకూ మిత్రులు-వాళ్ళు చెపుతుంటారు నీ గూర్చి అంతే'

అబద్ధం! నేను నమ్మను-

ఆయనే అన్నాడు 'ఈ లోకం చాలా విచిత్రమైనదయ్యా-మనిషిని మనిషిగా గుర్తించలేదుకాని నిమిషాలమీద మనుషులను దేవతలకిందకు మారుస్తుంది-తమాషాగా లేదూ?'

'తమాషా ఏమిటి స్వామీ-మీ మాహాత్మ్యాలూ, మానవాతీత శక్తులూ నేను వినలేదనుకున్నారా ఏమిటి-'

'కిరణ్-మరీ పెద్దపెద్ద మాటలు వాడకు మీ అందరి వ్యవహారం చూస్తే నన్నిప్పుడే ఏ సన్యాసాశ్రమం లోకో పంపేటట్లుంది. నేనూ మీలాంటి స్టూడెంటునే నయ్యా-కాలేజీ విద్యార్థిని-కాకుంటే ఆలస్యంగా చదువు మొదలుపెట్టడంవల్ల వయస్సులో కొంత పెద్దవాణ్ణి అంతే-స్వామీ, ఏమిటి స్వామీ, గీమీ-ఎవడన్నా నవ్వుతాడు-

'నవ్వుతాడు కాదు స్వామి నమ్ముతాడు-మిమ్మల్ని చూస్తుంటేనే దైవాంశ సంభూతులని ఎవడైనాసరే గుర్తించి తీరుతాడు.'

'మీ పిచ్చికి నేనేం చెప్పను?'

ఈ 'పిచ్చి' అనే మాటకు త్రుళ్ళిపడ్డాను నా 'పిచ్చి'ట!

'స్వామీ మీరు తమాషాకు కూడా పిచ్చి-గిచ్చి ఇలాంటి మాటలు వాడకండి-నన్ను బాగాచదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఆశీర్వదించండి.'

చిదంబరరావు నవ్వాడు-తమాషాగా నా వీపుచరిచి 'పోదాంపద అన్నాడు.

నేనూ ఆయనవెంటే లేచి నిలబడ్డాను.

చిదంబరరావు ముందూ నేను వెనుకా-

నేను అడగకుండానే చిదంబరరావు తనగూర్చి చెప్పుకున్నాడు. ఆయనది గోదావరిజిల్లాలోని ఓచిన్నగ్రామం. చిన్నప్పటినుంచీ గ్రామ రాజకీయాలలో పాల్గొనడంవల్ల చదువుసంధ్యల గూర్చి అంతగా పట్టించుకోలేదు - ఏదో భుక్తికి ఇంత వుండటంతో వెంటనే ఉద్యోగంచేసే అవసరంకూడా లేకపోయింది. వయస్సు పెరిగేకొద్ది కుటుంబ బాధ్యత నెత్తిన పడేకొద్దీ ఏదైనా సంపాదనా మార్గం వుండక తప్పదనిపించింది లా లో చేరి మంచిమార్కులు తెచ్చుకుంటే ఎక్కడైనా మునిసిఫ్ మేజిస్ట్రేట్‌గా అప్పాయింట్ కావచ్చు-లేదా ఏలూరులోనో, రాజమండ్రిలోనో, బోర్డు తగిలించవచ్చు. ఈ ఉద్దేశంతో చదువులో చేరాడట, ఆయన చేరి అప్పుడే సంవత్సరం గడిచింది . ఇది రెండోయేడు.

నేనుమాత్రం ఈ ఎకడమిక్ ఇయర్‌లోనే చేరాను. అందుకని నాకది మొదటి సంవత్సరం.

'అయితే స్వామీ....'

'హుష్ - పేరుపెట్టి పిలువు కిరణ్.'

'అలాగే - ఇంతకూ మీకీ సిద్ధులు ఎలా అలవడ్డాయి?'

'ఏ సిద్ధులు?'

'అవే మంత్ర తంత్రాలూ - మానవాతీత శక్తులూ.'

చిదంబరరావు మళ్ళీ నవ్వాడు

'ఇదుగో - ఇలాంటి మాటలు మళ్ళీ అనకు. ఎవరన్నావింటే బాగుండదు'

నేను ముభావంగా వూరుకున్నాను.

యూనివర్శిటీ గేటు వచ్చింది. మళ్ళీ జనసంచారం.బయట కిళ్ళీ దుకాణాల వద్ద విద్యార్థులు కొందరు చిదంబరరావును చూచారు.

'గురూజీ- గురూజీ- వూళ్ళోకి హారర్ ఆఫ్ డ్రాక్యులా వచ్చింది. వెళదామా?' ఎం.పి. పాత్రో సిగరెట్ పొగలతో మేఘాలు సృష్టిస్తూవచ్చాడు అతని వెంటనే వినోద్ చటర్జీ; స్వామీ; కూడా వచ్చారు.

'అవునోయ్ క్రితంసారి వచ్చినప్పుడుకూడా చూడలేదు. మిస్ అయినాం'- అని నావైపు చూచి 'కిరణ్- జల్దీవెళ్ళి భోజనం ముగించుకొని మా రూం దగ్గరికి రా పోదాం' అన్నాడు చిదంబరరావు.

నేను అలాగేనని తలవూపి మెస్‌కు అభిముఖంగా నడక సాగించాను.

చిదంబరరావుకు నామీద అభిమానం ఏర్పడుతున్నది.

అందులో అనుమానంలేదు

నేనే ఇంకా ఆయనతో సరిగ్గా మాట్లాడటంలేదు -

మహాత్ములను నమ్మాలి - అంతేకాని మీకీ మానవతీత శక్తులు ఎలా వచ్చాయి? అని ప్రశ్నలు వేయడం తప్పు.

ఇకనుంచి జాగ్రత్తగా మాట్లాడాలి.

సినిమాకు రమ్మన్నాడు సరేకాని రాత్రి ఒక చాప్టర్ ఫినిష్ చేద్దామనుకున్నానే ఎలా??

నా వైరికాని చిదంబరరావు గట్టిగా సంకల్పిస్తే ఇలాంటి పరీక్షలొక లెక్కా? యూనివర్శిటీ ఫస్టు దెబ్బకు ఇప్పిస్తాడు - ఆయన తలుచుకుంటే రికార్డు బ్రేక్‌కూడా చేయించగలడు నాచేత -

ఈ విశ్వాసం బాగానే ఉంది.

అదే నిజమయితే ఆయన ఎందుకు ఫీజుకట్టి రోజూ క్లాసులకు వెళ్తున్నాడు??

చదవకుండా మంత్రతంత్రాలతో డిగ్రీలు సాధించవచ్చా?? నా మనస్సు కేమీ పాలుపోలేదు.

అంతా గందరగోళంగావుంది.

కాళిదాసు నాలుకమీద దేవత బీజాక్షరాలు వ్రాసిందనీ దాంతో ఆయన మహా కవిత్వం చెప్పడం మొదలుపెట్టాడనీ 'మాణిక్యవీణాం' అంటూ రసవంత మైన దండకం ప్రారంభించాడనీ కథ ఇలాంటివి ఇంకా ఎన్నో వున్నాయి మన మన చరిత్రలో. పురాణాల్లో-వీటినన్నింటినీ నమ్మకుండా కొట్టిపారేయడం ఎలా??

ఈ ఆలోచనా ప్రవాహంలో నేను మెస్‌కు వెళ్ళడం భోజనంచేయడం తిరిగి సద్ధర్మ సదనలో నా రూంకు చేరడంకూడా అయింది.

జేబులో ఓ పది రూపాయల నోటు పెట్టుకొని వెంకటరెడ్డికి చెప్పాను సినిమాకు వెళ్తున్నానని. ఆయనది మా వూరుదగ్గరే ఓ గ్రామం. ఇరువురం విజయవాడలో కూడా క్లాసుమీట్సుము. కావాలని ఒకేరూంలో వేయించు కున్నాము.

వెంకటరెడ్డి వింతగా నన్నుచూచి అన్నాడు.

'ఇదేంవబ్బా! తమాషాగుందదే! నివ్వేంటి? సినిమాకెళ్ళడమేంటి??'

చిదంబరరావు రమ్మన్నాడని చెప్పడమా వద్దా? అని ఆలోచిస్తున్నాను.

'ఏం పిక్చరు?'

'హారర్ ఆఫ్ డ్రాకులా'

'ఇదుగో కిరణూ-అట్టాంటి సినిమాలు చూడకయ్యా నీ పుణ్యముంటది. దయ్యాలూ భూతాలూ ఏమి సినిమాలవి'.

నేనేం జవాబివ్వలేదు. మెల్లగా చిదంబరరావు గదికేసి నడిచాను. నిజానికి రెండో ఆట సినిమాకు బయలుదేరడం నా జీవితంలో ఇదే ప్రథమం.

నేను చేరేటప్పటికే చటర్జీ, స్వామి చిదంబరరావు గదిముందు కుర్చీలు లాక్కుని కూర్చొని బాతాఖానీ కొడుతున్నారు - ఇందులో స్వామి అందరికీ తెలిసినవాడే - గత సంవత్సరం ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాడు - ఆయన ఖర్చుపెట్టినంత డబ్బు ఎవరూ పెట్టలేదని అంటారు.

'చిదంబరరావుగారు లేరా' వస్తూనే ప్రశ్నించాను.

'రా బ్రదర్ - రా- ఆయన లోపల పూజచేసుకుంటున్నారు - ఓ పది నిమిషాల్లో వస్తారు'. అని నాకో కుర్చీచూపి మళ్ళీ వాళ్ళ బాతాఖానీలో వాళ్ళు పడ్డారు.

ఇంత ఆధునిక యుగంలో యూనివర్సిటీ హాస్టల్‌లో ఈ పూజలూ పునస్కారాలూ - ఏమిటిది??

నమ్మశక్యం కాకుండా ఉంది.

కాసేపటికి గది తలుపులు తీసి చిదంబరరావు వచ్చాడు. గదినిండా సాంబ్రాణి కడ్డీల ఘుమఘుమలు - చిదంబరరావు వస్తూనే నన్ను చూచి నవ్వాడు.

'భోజనం అయిందా కుమార్'

'అయిందండీ'

'మీరు రా'

'మాకు ఆకలిగా లేదుగురూజీ - సాయంత్రం హెవీ టిఫెన్ పడింది. థియేటర్ దగ్గర టీ తగిలిస్తే సరి'

చిదంబరరావు కుర్చీలో కూర్చున్నాడు.

సంభాషణ నిరుద్యోగ సమస్య ప్రస్తుత విద్యా విధానం ఇలాంటి అంశాల మీదకి సాగింది-

ఆయన మంచి మాటకారి అని నేను గమనించాను

తాను చెప్పే ప్రతి విషయం గాలిలో పేనినట్లుండదు. సోపపత్తికంగా అంకెలూ, అక్షరాలూ, ఉదాహరిస్తూ కొటేషన్లూ దొర్లిస్తూ నిరూపించుకుంటూ పోతాడు- ఆయన చెప్పినదంతా విన్నాక ప్రతి విషయమూ 'నిజమే-నిజమే' నని పించింది - దేశం పతనమైపోయిందనిపించింది - దీనికి పరిష్కారం చిదంబర రావు లాంటి వాళ్ళు తప్ప చూపలేరనిపించింది.

సంభాషణల్లో ఎంతసేపు టైం గడిచిపోయిందో మాకేతెలియదు. ఇంతలో మరో ముగ్గురు స్టూడెంట్సూ వచ్చారు.

'గురూజీ రెండోఆట అందదు'- స్వామి అన్నాడు.

'వాళ్ళమొఖం-మనం పోంది సినిమా ఎలా మొదలవుతుందోయ్ లేవండి' చిదంబరరావు లేచి రూం లాక్‌చేసి బయలుదేరాడు.

ఆయన మధ్యలో-

మేమంతా పరివారంలా చుట్టూ పరివేష్ఠించి.

బస్సెక్కాము అప్పటికే తొమ్మిదీ యాభై అయింది. మరో పది పదిహేను నిమిషాల్లో ఎల్లమ్మ తోట చేరాము. రాకరాక నేను రెండో ఆట సినిమాకు బయలు దేరడం, అదీ మధ్యలోనుండి చూడటమా?

ఇలా అనుకుంటూ థియేటర్ దగ్గరకు చేరాము. లోపల ఆట నడుస్తున్నది.

'మొదలుపెట్టారు గురూ.' చటర్జీ అన్నాడు-స్వామి బుకింగ్ వైపు పరుగెత్తాడు.

ఆశ్చర్యం!! అది మొదటాటే! ముగింపుకు వస్తోంది - మధ్యలో సరిగ్గా గంటకు పైగా కరెంటు పోయిందట! నేను నివ్వెరపోయాను.

నోట మాటరాలేదు.

గుడ్లప్పగించి అలా చిదంబరరావును చూస్తూ ఉండిపోయాను. మేము వెళ్ళిన కాసేపటికి మొదటాట ముగిసింది.

ఆట వదిలాక టిక్కెట్లకు స్వామి బయలుదేరాడు. నేను జేబులోనుండి పదిరూపాయల నోటు తీయబోతున్నాను. 'స్వామీ' చిదంబరరావు పిలిచాడు.

ఇలా చిటికెవేసినట్లు వేశాడు. రెండు పదిరూపాయల నోట్లు. స్వామి చేతికిచ్చాడు. నేను దిగ్భ్రాంతుడినైనాను. ఎదురుగా విద్యుద్దీపాలూ మనుషులూ కన్పడటంలేదు. విరాట్ స్వరూపంతో చిదంబరరావూ అతను సృష్టించిన పది రూపాయలనోట్లూ కన్పడుతున్నాయి. అవి దొంగనోట్లుకాదు. చెల్లాయి.

స్వామి గ్రూపు మొత్తానికీ టిక్కట్లు తెచ్చాడు. హాలులోకెళ్ళాము

ఆటమధ్య టీలూ, కూల్‌డ్రింక్సు, అన్నింటికీ చిదంబరరావేడబ్బు పెట్టాడు.

డ్రాకులా సినిమా భయంకరంగానే వుంది.

కాని ఈ అద్భుతాలు చూచింతరువాత సినిమాలో సన్నివేశాలు ఆశ్చర్యంగా కన్పడలేదు.

x x x

ఇప్పుడు నేను చిదంబరరావు ముఖ్య భక్తులలో ఒకణ్ణి. ఉదయం అందరూ లేవకముందే నిద్రలేచి స్నానాదులు ముగించుకొని చిదంబరరావుగారి రూంకు వెళతాను. నేను వెళ్ళేటప్పటికే గురూజీ రూంకు నటరాజన్ అని పూణ్ణోనుండి మరో భక్తుడు వచ్చి వుంటాడు ఆయన చిదంబరరావంటే సాక్షాత్తూ కల్కి అవతారమనే నమ్మకం. ప్రతిరోజూ పూలూ పళ్ళతో వస్తాడు. పాదపూజచేసి

తీర్థం పుచ్చుకొని ఆపైన డ్యూటీలోకి వెళతాడు. తర్వాత చిదంబరరావు రూంకు స్వామీ, పాత్రో చటర్జీ ప్రభృతులు వస్తారు అక్కడినుండి గురూజీతో సంభాషణ ప్రారంభమవుతుంది. ఆయనేమీ అతిలోక విషయాలగూర్చి ఎన్నడూ మాట్లాడరు. కేవలం లోకంలోని తిరుతెన్నుల గూర్చి నిరుద్యోగ సమస్యగూర్చి యాంత్రిక నాగరికతవల్ల ఉత్పన్నమైన సమస్యలగూర్చి ప్రస్తంచేస్తారు. వాటికి పరిష్కార మార్గాలు కొన్ని సూచిస్తారు. కొన్నిటిని 'కాలమే పరిష్కరిస్తుంద'ని వదిలేసి వూరుకుంటారు.

చిదంబరరావుగారి భక్తులలో డిప్ ఇన్. కుప్ చదువుతున్న రాధాస్వామి కూడా వున్నాడు ఆయన దృష్టిలో చిదంబరరావు సాక్షాత్తు దయాల్బాగు రాధాస్వామి అవతారం. అందులోనూ తాను చదువుకున్న కాలంలో తనకు సహాయంగా చిదంబరరావును పరమేశ్వరుడూ తన గురువూ అయిన రాధాస్వామే పంపాడని ఈ రాధాస్వామి నమ్మకం. అందుకు తగ్గట్టే చిదంబరరావు రాధాస్వామికి ఎంతో సహాయం చేసేవాడు. బయట రాధాస్వామి చేయవలసిన ఫీల్డు సర్వే మొత్తమూ చిదంబరరావే చేసి పెట్టేవాడు. జాలారిపేటలో భజనలు నిర్వహించడం, రికార్డులు వ్రాయడం అంతా చిదంబరరావే చేసేవాడు.

నిజానికి చిదంబరరావుకూడా చేసేవాడు కాదు. రాత్రి రాధాస్వామి తనకు కావలసిన వర్క్ బుక్స్ గురూజీ గదిలో పూజామందిరంలో పెట్టి పోయేవాడు. తెల్లవారేసరికి అన్ని పుస్తకాలలోనూ వర్క్ మొత్తం సిద్ధంగా వుండివుండేది.

ఒకరోజు సాయంత్రం గురుజీ నాతో అన్నారు. 'కుమార్ జాలారి పేట భజనకు వస్తావా?'

మారుమాటాడకుండా వెంబడించాను. 'వస్తావా' అంటే రమ్మనే గురూజీ ఆజ్ఞ అన్నమాట.

నేనూ రాదాస్వామీ, గురూజీ, ముగ్గురం జాలారిపేటలోని రామ మందిరానికి వెళ్ళాము. అక్కడ పగలల్లా పడవపనిచేసి అలసిపోయిన జాలారి వాళ్ళు చాలామంది చేరారు. కొందరు స్త్రీలు పసిబిడ్డలతోసహా వచ్చారు-ముందు భజన కార్యక్రమం-తర్వాత గురూజీ ప్రసంగం-

ఆ ఉపన్యాసం జాలారివాళ్ళకు బాగా వచ్చింది. ఎందుకంటే భక్తిని గూర్చి కాని ప్రపత్తియోగాన్ని గురించి కాని మాట్లాడకుండా జాలారివాళ్ళకు

నైలాను పలలు ప్రభుత్వం సప్లై చేయవలసిన ఆవశ్యకత గూర్చి అర్ధగంట సేపు మాట్లాడి అలాంటిది జరగాలంటే వాళ్ళందరిలోనూ ఐక్యమత్యం చాలా ముఖ్యం అని ఉద్బోధించారు. గోదావరి జిల్లాకు చెందిన గురూజీ విశాఖ వాళ్ళతో అచ్చంగా జాలారి వాళ్ళ మాండలికంలో మాట్లాడటం నాకు ఆశ్చర్యంవేసింది. అంతకుమించిన విచిత్ర మేమంటే గురూజీ భజనను చూడడానికి ఉపన్యాసం అనంతరం తమ సందేహాలు తీర్చుకొవడానికి ఆ సమీపంలోని చాలామంది ఉద్యోగస్థులు కూడా వచ్చారు. వాళ్ళ ప్రశ్నలన్నిటికి గురూజీ సమాధానాలు ఇచ్చేవారు. అవి యుక్తి యుక్తంగానూ ఆలోచించినకొద్దీ అర్థవంతాలుగానూ వుండేవి.

'స్వామీ నాపై ఆఫీసరు లోక కంటకుడు. రిటైర్ అయినా కూడా ఎక్స్టెన్షన్ సంపాదించుకున్నాడు అన్యాయంగా ఈ భక్త పరమాణువుకు ఆ పోస్ట్ ఎప్పుడు వస్తుందంటారు?'

'దేనికైనా కాలం రావద్దా నాయనా'

ఆ రిటైర్డ్ ఆఫీసరుకు త్వరలోనే కాలం ముగిసిందనీ నూకలు చెల్లాయని అర్థం.

'మా వాడు మెడిసన్ సీటుకు అప్లై చేశాడు ఏ వూళ్ళో వస్తుందంటారు?'

'వాడి భాగ్యం ఎక్కడ పండితే అక్కడే వస్తుంది. దిగులెందుకు నీకు?' హైదరాబాదులో వస్తుందని సూచన-

'మొన్న మాయింట్లో దొంగలుపడ్డారు-పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాము ఇంతవరకు ఫలితం కన్పడలేదు స్వామీ'

'ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడయ్యా'

దొంగతో గుర్కావాడో, పని మనిషో షరీకై వుండవచ్చునని నాకు తోచింది. కాదు వాళ్ళ బావమరిదే ఈ దొంగతనం చేయించాడని ఆ వచ్చిన వ్యక్తి నమ్మకమట-నిధిని గూర్చిన ఆ అనుమానం స్వామివారి సన్నిధిలో నిజమైందికూడాను. ఇంకేం బావమరిదిని ఇంట్లో నుండి తరిమేసేందుకు కృతనిశ్చయుడై వెళ్ళాడు ఆ ఆసామీ ఇలా ఎన్నో ప్రశ్నలకు గురూజీ జవాబులు చెప్పేవారు. అందరికీ ఆయన మాట వేదాక్షరంలా తోచేది. ప్రత్యక్ష ప్రమాణాలు కూడా కన్పించేవి. వాటికి తోడు మహిమలూ మంత్రాలూ-తంత్రలోనే జాలారి

పేటలో ఒక చిదంబరేశ్వర మందిర నిర్మాణం చేయాలనీ, మహారాణి పేటలోనూ, దొండపర్తిలోనూ రెండు చిదంబర తత్వాన్వేషణకై అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ భక్తులు నిశ్చయించారు చిదంబర రహస్యాన్ని ప్రపంచానికి అందించడానికై ఒక పత్రికను కూడా స్థాపిస్తే బాగుంటుందని కాల్టెక్స్ ఉద్యోగులు, షిప్‌యార్డ్ ఆఫీసర్లూ సూచించారు. ఆకాశవాణి బృందం వారు ప్రచారం బాధ్యతను తమ భుజస్కందాలపై వేసుకున్నారు ఉద్యోగం కూడా వదిలి పత్రికా నిర్వహణ బాధ్యత స్వీకరిస్తానని నటరాజన్ అందరి ఎదుటా ప్రమాణం చేశాడు.

నేను గురూజీతో జాలరిపేటకు వెళ్ళినప్పుడల్లా కింగ్‌జార్జి హాస్పటల్లో పనిచేసే ఓ నర్సు వచ్చి ముందు వరుసలో కూర్చొని వుండేది. ఆమె స్వామి వారిని ఏమీ ప్రశ్నలు వేసేదికాదు. ప్రసంగం. ప్రశ్నలకు సమాధానాలూ, ముగిశాక ఆమె ఆశాపూరిత నయనాలతో స్వామివైపు చూచేది. చిదంబరరావుగారు ఆమెనొకసారి చూచేవారు అంతే! ఆమె మనస్సులో వున్న సందేహాలు తీరినట్లు భావించి వెళ్ళేది. ఇలా జరగడం నేను చాలాసార్లు చూదాను - దానితో నాకేదో కుతూహలం పెరిగింది. ఆమె ఏమి కోరుకుంటున్నదో తెలుసుకోవాలనే కోరిక నాలో దినదిన ప్రవర్థమానమైంది. ఆమె సంశయాలేమిటి? వీరి మౌన వ్యాఖ్యానమేమిటి??

ఒకనాడు గురూజీ ప్రసంగం, జవాబులూ, ముగిశాక భక్తులంతా ఆయన చుట్టూ మూగారు. ప్రసాదాలు పంచిపెడుతున్నారు నేను ఆమెతో మాట్లాడాలని ముందుకు నడిచాను. ఆశ్చర్యం! ఆమెకూడా నాతో మాట్లాడాలని ఇటు చూస్తున్నట్లు ఆమె కళ్ళనుబట్టి గమనించాను.

నన్ను చూచి ఆమె నవ్వింది.

నాకేదో గుండె ఝల్లుమన్నట్లు అనిపించింది. దగ్గరకు వచ్చి నమస్కరించింది ఎంతో వినయంగా. నేను మళ్ళీ నమస్కారం పెట్టాను.

'కిరణ్‌కుమార్‌జీ!' పెదవులపై ఎర్రమందారాలు పూచినట్లు నవ్వుతూ నాతో ఏదో చెప్పబోయింది.

నేను భయంగా గురూజీవైపుకు చూచాను.

ఆయన భక్త సమూహంతో చర్చలలో మునిగిపోయారు.

ఆమె అన్నది 'నాపేరు మాధవి. ఇక్కడ ఆస్పత్రిలో పనిచేస్తున్నాను. మీరు స్వామీజీకి చాలా ఆత్మీయులని విన్నాను. దయతో నాకొక చిన్న సహాయం చేసిపెట్టాలి'.

'స్వామీజీకి అందరూ ఆత్మీయులే. అయినా మీకేం కావాలో చెప్పండి. నా శక్తివంచన లేకుండా చేస్తాను.'

ఆమె ఒక్క క్షణం ఆగింది.

ఆమె ఏం చెపుతుందా అంటూ అలా చూస్తున్నాను.

మాధవి అన్నది 'తమకు అభ్యంతరం లేకపోతే రేపొకసారి మా యింటికి రాగలరా?'

'అ-లా-గే'

నాలో ఏవో తెలియని కొత్త స్పందనలు. సరికొత్త లోకాలు.

మాధవి, మహారాణి పేటలో తానుండేచోటు చెప్పింది. శీతల సరస్సులో నల్లతామరలు వికసించినట్లు ముంగురులతో చుట్టుకున్న ఆ ముఖంలో కళ్లు మెరుస్తున్నా వాటి వెనుక ఏదో దిగులు వున్నట్లు గమనించాను నాచులాగా!

'దయతో నాకీ చిన్న సహాయం చేసిపెట్టారా మీ మేలునీజన్మలో మరిచిపోలేను. పటం పెట్టి పూజ చేసుకుంటాము ఉదయం ప్రతిరోజూ మిమ్మల్ని'.

చర్చలూ, ప్రసాదాలూ అన్నీ ముగిశాయి.

గురూజీ యూనివర్శిటీకి బయలుదేరారు.

నేనూ వెంబడించాను.

బస్‌స్టాప్‌వరకు వెళ్ళాక నన్ను చూచి అన్నారు. 'ఏమిటి మాధవి నీతో చెపుతున్నది?'

గురూజీ చూచారన్నమాట - ఆయన చూడకుండా వుండటమా??

'అవును గురూజీ - మీరు చూచినట్లున్నారే'

'అవును - చూచాను కాని వినలేదు - కొందరు చూడటమే కాని వినరు - కొందరు వినడమే కాని చూడరు'- ఈ మాటలకు అర్థం ఏమిటి?

'మాధవికేదో కష్టం వచ్చిందట.నన్నొకసారి వాళ్ళ ఇంటికి రమ్మన్నది'.

గురూజీ విని వూరుకున్నారు.

'వెళ్ళమంటారా గురూజీ'

'వెళ్ళు - కాని చూడు కిరణ్ అజ్ఞానం అందకారంలాంటిది - ప్రత్యక్ష దర్శనం లభిస్తేనే కాని అది తొలగదు. కాని దర్శనం లభించడం అంతతేలికా?'

నన్నేదో హెచ్చరిస్తున్నట్లనిపించింది.

కాసేపట్లో యూనివర్సిటీకి చేరాము.

మాధవిని లోగడ చాలాసార్లు ఈ భజన సమావేశంలో చూచాను కాని ఇవాళ ఆమె నాతో మాట్లాడటంతో ఏదో కొత్త అనుభూతి, కొత్త మాధుర్యం కనిపించింది.

నిజంగా మాధవి చాలా అందమైనవాళ్ళల్లోనే లెక్క. ఆమె అందం మొత్తం ఆ మెడలో వుంది.

ఆదేదో కవులు వర్ణించేటట్లుంటుంది. శంఖంలాగానో మరెలాగో-ఎంత సేపు చూచినా తనివితీరదు. నిజం చెప్పాలంటే ఆమెనలా చూడాలనిపించింది కూడా ఎక్కువగా ఈనాడే!

చూచినకొద్దీ మళ్ళీ చూడాలనే కోరిక-

చూస్తున్నకొద్దీ ఏదో జంకు - ఏదో తీపి-

పక్కమీద పడుకున్నాను-

వెంకటరెడ్డి చదువుకుంటూవున్నాడు-

'ఏం కిరణూ - పుస్తకం ముట్టలేదు-'

'మనసేం బాగాలేదు రెడ్డీ'

x x x

మర్నాడు సాయంత్రం అనుకున్న సమయానికే వెళ్ళాను.

మాధవి గౌరవంతో లోనికి ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసింది.

ఆమె అందించిన కాఫీ తాగుతూ ఇల్లంతా పరిశీలించాను. చాలా నిరాడంబరంగా వుంది. అయితే చాలా నీట్‌గా అలంకరించుకున్నది.

ఇంట్లో ఎక్కడా మగసవ్వడి వినపడలేదు-

'త్వరగానే వచ్చేశారు-' ఆమెకూడా నాకెదురుగా కూర్చొని కాఫీతాగుతూ అన్నది.

'అవును. త్వరగానే బస్సు అందింది' అబద్ధం చెప్పాను. నిజానికి ఇంకా తొందరగానే రావాలని కోరిక - కాని ఎంతకూ సాయంత్రం కాలేదు కదా!

'మీవారు ఇంకా ఆఫీసునుంచి వచ్చినట్లులేదు'

ఆమె నవ్వింది-

సిగ్గుపడింది.

ఇంగ్లిషులో అన్నది. 'నేను అవివాహితను'

ఆ విషయం నేను పోల్చుకున్నమాట నిజమే ముందుగానే, అయినా ఏమిటో తొందర- ఆమె నోటనే వినాలనే కోరిక.

మరీ నా ప్రవర్తన నాకే బాగుండలేదు.

కాని__

మనస్సు ఏమిటో తొందరపెడుతున్నది.

కోతిలా గెంతుకున్నది.

స్థిరం తప్పి చరిస్తున్నది.

'మా అమ్మకు నే నొక్కతెనే కూతురును. నా చిన్నతనంలోనే మా నాన్న గారు పోయారు. కష్టపడి నన్ను పెంచి పెద్దచేసింది. నర్స్ ట్రైనింగ్ చెప్పించింది. అప్పుడే ఆమెకు కంటిజబ్బు వచ్చింది. ఎవరో అరకులోయనుండి ప్రకృతి సంబంధమైన చికిత్స చేస్తానని ఓ కొండరాజు వచ్చాడు. ఓ మూలిక ఇచ్చి 'అరగదీసి కంటికి పెట్టు, తెల్లవారేసరికి తగ్గుతుంద'న్నాడు-అలాగేచేసింది- కాని తెల్లవారేసరికి చూపు పూర్తిగా పోయింది'- ఈ మాటలు చెబుతుంటే మాధవి ముఖంలో దైన్యం ఆవరించింది.

ఎంతో ఖిన్నురాలై పోయింది.

'మీ అమ్మగారు....'

'రండి చూద్దురు'- లేచింది.

నేకూ లేచాను-

ఆమె లోపల గదిలోగుండా పెరట్లోకి సాగింది.

నేను బూట్లు విప్పుతున్నాను-

'పరవాలేదు - రండి'-

ఆమెను వెంబడించాను-

పెరట్లో ఓ చెట్టుక్రింద ముసలావిడ కూర్చొని ఉంది.

'అమ్మా....'

'మాధవీ'

'ఆయనొచ్చారమ్మా'

'నిజంగానా' ముసలావిడ ఆనందంతో కదిలిపోవడం గమనించాను.

'ఆయనొచ్చారు' అన్న మాటతో నాకేదో వేయివీణలు మీటినట్లని పించింది, ఆయనొచ్చారు - ఆయన!!

'బాబూ, ఇటురా'- నన్ను దగ్గరగా పిలిచింది ఆమె ఆప్యాయంగా.

సమీపంగా వెళ్ళాను.

మాధవి మరోకుర్చీ తెచ్చి వేసింది.

కూర్చున్నాను.

ముసలామె చేతితో తడుముతూ ఏదో సంతోషాన్ని వెలిబుచ్చింది. కళ్ళ వెంట అప్రయత్నంగానే ఆమెకు నీళ్ళు జాలువారాయి - గొంతు గాద్గదికమైంది.

'బాబూ కిరణ్‌కుమార్ - ఇక నన్ను నువ్వే రక్షించాలి'.

'ఏం ఫరవాలేదమ్మా' అంటూ స్వామీజీ మాటలు జ్ఞాపకం చేసుకున్నాను- ఆయన నిన్న రాత్రి ఏమన్నారు?'

'కొందరు వినడమే కాని చూడరు- కొందరు చూడటమే కాని వినరుట'

'అజ్ఞానం అంధకారంలాంటిది ప్రత్యక్ష దర్శనం లభిస్తేనే కాని అది తొలగదు. కాని దర్శనం లభించడం అంత తేలికా?'

దర్శనం లభించడం తేలికకాదని స్వామీజీ సందేశం- అప్పుడిదేదో వేదాంత విషయమనుకున్నాను కాని మాధవి తల్లిగూర్చే చిదంబరరావుగారు చెబుతున్నారని నాకు ఇప్పటికి కాని అర్థంకాలేదు.

ఎంత విచిత్రం!!

మాధవి తల్లి తనకు గుడ్డితనం ఎలా ప్రాప్తించిందో వివరంగా చెప్పింది. అరకులోయ కోయవాడు రావడం - మూలికలు వాడటం - గుడ్డితనం రావడం- ఆ తర్వాత తన దురవస్థా, మాధవి కష్టాలూ.

'కిరణ్ బాబూ - నీవేంచెపితే స్వామీజీ అది వింటారని తెలిసింది. ఎలాగైనాసరే వారితోచెప్పి నాకీకళ్ళు తెప్పించు- నీ ఋణమీజన్మానికికాదు జన్మజన్మలకి తీర్చుకోలేను'

'ఫరవాలేదమ్మా మీకు తప్పకుండా చూపు వస్తుంది. ఇప్పుడు హాస్టల్‌కు వెళ్ళగానే స్వామీజీకి చెపుతాను. ఆయన చాలా గొప్పవాడమ్మా. మానవాతీతుడు. ఆయన తలుచుకుంటే మీకు చూపురావడం ఓ పెద్ద లెక్కలో విషయంకాదు-'

'నాతండ్రీ - నా బంగారుతండ్రీ - నా దిగులంతా వెర్రిపిల్ల ఆ మాధవి గూర్చే నాయనా - దేవుడు దానికి లోకంలో లేనంత అందం ఇచ్చాడు - అదే దాని శత్రువుగా ఎక్కడ మారుతుందోనని భయం-గుడ్డిదాన్ని ఏం చేయగలను? ఉద్యోగం మానిపిద్దామంటే గడవడమే కష్టం. మింగలేక కక్కలేక ఇలా విషాన్ని గొంతులోనే నిలుపుకొని కుమిలిపోతున్నాను బాబూ లోలోపలే.'

మాధవితల్లి ఏడుస్తున్నది-మాధవి కంటతడి పెట్టింది. నాకూ ఎందుకో అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి-పైకి ఇంత అందంగా కన్పించే మాధవి వెనుక ఇంతటి విషాదం గూడుకట్టుకొని ఉందని ఎవరు ఊహించగలరు?

మాధవి తల్లిపేరు చంద్రమ్మట-అంతా చిన్నతనం నుండి 'చంద్రా' అనే పిలిచేవారట. ఆ అందం చందం చూచి ఆడవాళ్ళే మురిసిపోయేవారట. అట్లాంటి తనకు చివరకు చూపుకూడా లేని ఈ కష్టం....

చంద్రమ్మ తన గతవైభవాన్ని నెమరువేస్తూ స్వగతంగా కొంత, నన్ను ఉద్దేశించి మరికొంత, చెప్పుకుపోతూ ఉన్నది-

'అమ్మా-వారినలా మరీ విసిగించకు నీ సోదినంతా చెప్పి, వారి కసలే టైం తీరిక ఉండదు-ఇలా గంటలకుగంటలు వదలకుండా చెపితే ఎలా' మాధవి, తల్లిని మందలించింది.

'అలాగేనమ్మా-బాబూ నీ వెలాగైనా నాకీ సహాయం చేయాలి' నా రెండు చేతులూ తనచేతుల్లోకి తీసుకొని దాదాపు నమస్కరించినట్లుగా కళ్ళకద్దుకున్నది.

నాకు టైం ఏదో అమూల్యమైనదిలా భావిస్తున్నదే మాధవి-ఈ మాటతో నేనిక బయలుదేరక తప్పలేదు. మనస్సుమాత్రం వెనక్కు లాగుతున్నది-

మరి కొంచెంసేపు కూర్చోవాలని-

కాళ్ళుమాత్రం గత్యంతరంలేక ముందుకుసాగాయి-మాధవి కూడా నన్ను వెంబడించింది.

చంద్రమ్మకు వీడ్కోలుచెప్పి గుమ్మందాకా వచ్చాను-

'మాధవీ-దిగులుపడకండి-ఈవేళ రాత్రే స్వామీజీకి చెప్పి గట్టిగా ప్రయత్నిస్తాను-ఎలాగైనాసరే కళ్ళు వచ్చేటట్లు చేద్దాము-'

'ఏమైనా ఇక ఈ భారమంతామీదే కిరణ్‌బాబూ-అన్ని ఇంగ్లీషు వైద్యాలూ విఫలమైనాయి-ఆపరేషన్ చేసినా లాభంలేదుట-మానవా తీతశక్తులవల్ల రావలసిందే కాని మన ప్రయత్నాలు ఇంకేమీ పనిచేయవు-' మాధవి కన్నీళ్ళు పెట్టుకుంది-దుఃఖం ఎక్కువైంది.

నాకేమిటో తోచకుండా అయిపోయింది.

'ఏడవకండి-'ఓదార్చబోయాను-

'అమె తప్ప నాకీలోకంలో మరెవరూలేరు-ఆమెగతి ఇలాఅయింది నాకింక దిక్కెవరు?' మాధవి దుఃఖం తెరలు తెరలుగా పొంగివచ్చింది

నేను నిలవలేకపోయాను.

'మాధవీ'

'కిరణ్‌బాబూ' ఆమె నా రెండుచేతులూ పట్టుకుంది.నాలో ఏదో తెలియని ఉద్రేకం.

'మాధవీ' ఆమె కన్నీళ్ళు తుడిచాను.

'కిరన్‌జీ.'

కొన్ని క్షణాల నిశ్శబ్దం.

ఆమె దుఃఖపుపొంగు తగ్గింది-వాస్తవం కంలోకి వచ్చింది. నా రెండు చేతులలోనుండి తనచేతులు గుంజుకుంది.

నేనుకూడా దూరంగా జరిగాను ఏదో తప్పుచేసినవాడికి మల్లే. మెల్లగా గుమ్మం దిగుతున్నాను.

'మళ్ళీ ఎప్పుడు వస్తారు?' తలవంచుకొని అన్నది మాధవి.

'రేపు' అంటూ ఆమెకళ్ళలోకే చూస్తూ ఇవతలకి వచ్చాను.

x x x x

గురుజీ ఏదో విభూతి ఇచ్చారు.

దానిని ప్రతిరోజూ చంద్రమ్మ కంటికి కాటుకలా పూసుకొంటున్నది. కొన్నాళ్ళకు ఫలితం కన్పిస్తుందని, గురూజీ అన్నారు కాని ఎన్నాళ్ళకో స్పష్టంగా చెప్పలేదు. 'ఇన్నాళ్ళ'కు అని కాలనియమాన్ని ఇవ్వలేదు - నాటినుండి నేను ప్రతిరోజూ మహారాణి పేట పోవడం, చంద్రమ్మ కష్టసుఖాలు విచారించడం, మాధవికి పనుల్లో సాయపడటం చేయసాగాను.

'మీకెందుకీ శ్రమ - మా బాధలేవో మేమనుభవించక తప్పదుకదా!' అని మాధవి అనేది.

'కాదు మాధవీ! - పరుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నప్పుడే మానవుడికి నిజమైన తృప్తి అప్పుడే మానవత్వం వికసిస్తుంది' అని సమాధానం చెప్పేవాడిని.

అయితే ఆ సహాయం చేయబడే 'పరులు' మాధవి, ఆమె ముసలితల్లే ఎందుకు కావాలి? రోడ్డుకు ఇరువైపులా వున్న ఎంతోమంది కుంటి గుడ్డి బిచ్చగాళ్ళలో ఎవరైనా ఎందుకు కాకూడదు? అన్న ప్రశ్నకు నేను సమాధానం చెప్పకోధలచ లేదు. అలా ఆత్మవంచన చేసుకోవడంలోనే నాకేదో తృప్తి కనపడింది.

మాధవి చాలా చలాకీమనిషి.

అలా కబుర్లుచెప్పడం మొదలుపెట్టిందంటే క్యాలండరులో తేదీలు మారడంకూడా మరచిపోవలసిందే.

రాత్రి ఒంటిగంట - రెండూ-

ఒకనాడు బీచ్‌లో కూర్చున్నాము ఇద్దరమూ.

మాధవి కట్టిన నైలాన్‌చీర అంచు గాలికి రెపరెపలాడుతున్నది.

ముంగురులు ముఖంలో మరీ చిలిపిగా దోబూచులాడుతున్నాయి- 'వి'నెక్ జాకెట్‌తో మాధవి తన వీపునూ వక్షస్థలాన్ని చూపరులపై గాలాలుగా విసిరి ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్నది.

"మాధవీ"

తెలియని ఉద్రేకంతో పిలిచాను.

"ఊఁ-"

"నెనొక ప్రశ్న అడుగుతాను. జవాబు చెబుతావా సూటిగా"

"ఊఁ"

"ఊఁ కాదు. ఇటు నా కళ్ళలోకి చూచి జవాబుచెప్పు"

మాధవి మత్తుగా నా కళ్ళల్లోకి చూచింది.

గుండె పిండేసినట్లుందా చూపు.

"మాధవీ - నీవెందుకని పెళ్ళిచేసుకోలేదు?"

మాధవి సముద్రపు టిసుకను దగ్గరికి లాక్కొని పిచ్చుకగూళ్లు కడుతూ అన్నది.

"ఇప్పుడేమంత తొందర"

"అంటే ముసలిదానివైన తర్వాత చేసుకుంటావా ఏమిటి?"

మాధవి నవ్వింది.

ఆ నవ్వులో ఎంత కవ్వింపు - ఎంత కొంటెతనం!

"అదికాదు...."

"మరేమిటి?"

"పరిస్థితులు కొంత కుదుటపడాలి - తర్వాత___"

"తర్వాత"

"నా మనస్సుకు నచ్చినవాడు దొరకాలి"

"అంటే వాడికుండవలసిన క్వాలిఫికేషన్స్ ఏమిటి?? తెలుగు నవలల్లో హీరోయిను కోరుకునేటట్టు అతిలోక సౌందర్య శేఖరుడూ, ఓ అరడజను ఎయిర్ కండిషన్డ్ కార్లకు అధిపతీ, తల్లిదండ్రులు లేనివాడూ ప్రేమసామ్రాజ్యానికి ఏకైక చక్రవర్తీ - అలాంటివాడిని ఊహించుకొంటున్నావా ఏమిటి?"

"అన్ని గుణగణాలు, లక్షణాలూ నాకు కావలసిన వరుడికి నేనేమీ ఊహించుకోవడంలేదు - కేవలం నా మనసెరిగినవాడైతే చాలు - మంచివాడైతే చాలు".

"అలాంటి మంచితనం నీ కింతవరకు ఎవరిలోనూ కన్పడనే లేదా మాధవీ"

"కన్పడుతూవున్నది. కాని కంటికి కన్పడినదంతా చేతికి అందుతుందనే నమ్మకమేమిటి?"

"అదంత అందని మానిపండా?"

"ముంగిట్లో వున్నా అందుకునే అదృష్టం అందరికీ ఉండవద్దా?"

మాధవి ముఖంలో విషాదరేఖలు కన్పడ్డాయి.

"మాధవీ"

ఆమె బదులు పలకలేదు.

మాధవిచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను

ఎదురుగా సముద్రం హోరెత్తుతున్నది.

ఆచేతిని నా గుండెలకు హత్తుకున్నాను.

'మాధవీ."

"........."

చుట్టూ చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి.

"మాధవీ"

ఊఁ____

"నాదొక చిన్నకోరిక వుంది తీరుస్తావా?"

"ఏమిటి?"

"ఇలా శాశ్వతంగా మనం ఈ సముద్రాన్ని చూస్తూ కూర్చోవాలి".

చీకట్లో మల్లెలకాంతులతో మాధవి మృదువైన పలువరుస మెరిసింది.

"శాశ్వతంగా ఈనీళ్ళను చూస్తూ ఇలాగే కూర్చుంటే జీవనరసమంతా నీళ్ళకారిపోతుంది. సార్! లేవండి అవతల మీ హాస్టల్‌లో వేడివేడి భోజనాలు తయారై వుంటాయి"

x x x

మాధవిని చూడకుండా నాకిప్పుడొక్క రోజుకూడా గడవదు. ఆమె మాటలు విననినాడు నాకు పిచ్చెక్కినట్లుండేది ఆమెతో కలిసి కొత్తసినిమా లేవి వచ్చినా వెళ్ళవలసిందే-మాధవికిమాత్రం పాతసినిమాలు, అందులోనూ ఆఖరాట నాడు చూడటమంటే ఎంతోఇష్టం.

అప్పుడు హాలు చాలాభాగం ఖాళీగా ఉంటుంది.

వెనక ఎక్కడో ఎవరికి కన్పడకుండా కూర్చోవచ్చు

అలా వేరుశనగపప్పులు తింటూ రొమాంటిక్ సినిమాలు చూస్తూవుంటే మమ్మల్ని మేము మరచిపోతూ వుంటాము.

తెరమీద నాయికా నాయకులస్థానంలో మేమే ఉంటాము.

మాధవికికూడా సినిమాలంటే చాలాఇష్టం.

అందులోనూ లవ్‌సీన్స్ వచ్చినప్పుడు చీకట్లో మెరిసే ఆకళ్ళను చూస్తే ఆమె మాధవిలాకాక మాచల్దేవిలాగానో క్లియోపాత్రలాగానో కన్పించేది.

చీకట్లో నా మెడ చుట్టూ చెయ్యివేసి నన్ను దగ్గరికి లాక్కొని వెచ్చని శ్వాసను నాపై ఆమె వదులుతూంటే నా నరాలన్నీ ఉద్రేక శిఖరాలను చేరుకునేవి.

పిచ్చిపిచ్చిగా పళ్ళతో నా క్రింది పెదవిని కసితీరా కొరుక్కుంటూ ఆమె రెండు భుజాలను గట్టిగా పట్టుకునేవాణ్ణి.

మాధవి పరవశంతో అలా నా భుజాలపై వాలిపోయేది.

అలా ఎంతసేపు కూర్చునేవాళ్ళమో.

మళ్ళీ హాలంతా అదిరిపోయేటట్లు ఏ నేపథ్య గాయకుడో హీరోయిన్ మీదనో హీరోమీదనో ఓపాట పాడుతుంటే అప్పటికి తిరిగి ఇది సినిమాహాలని గుర్తుకువచ్చేది.

అలాహాలునుండి నేరుగా మహారాణీపేటకే ఇద్దరం వెళ్ళేవాళ్ళం.

ఒకొక్కప్పుడు ఎల్లమ్మ తోటవద్ద ఓ 'ఏ' క్లాస్ హోటల్లో భోంచేసే వాళ్ళం.

లేదా ఇంటికి పోగానే ఆర్తి వేడివేడి పూరీలు వేయించేది-కబుర్లు చెప్పు కుంటూ తినేవాళ్ళం.

చంద్రమ్మకూడా మా అన్యోన్యానికి సంతోషించేదే కాని ఏమీ అనేదికాదు. "భగవంతుడే మా కష్టాలను గట్టెక్కించడానికి నీ రూపంలో మాకు వరాన్ని ప్రసాదించాడు" అనేది ఎప్పుడైనా.

ఒకరోజు మేము సినిమానుండి వచ్చేసరికి బాగా ఆలస్యమైపోయింది. సినిమాకూడా చాలా బోర్‌గా ఉంది.

చెత్తకథ - చెత్త డైరెక్షన్ - అప్పడాల పిండిలా సాగదీశాడు ఇరవై రెండు రీళ్లు. ఆట వదిలి బయటకు వచ్చేసరికి భోజనహోటళ్లు మూసివేశారు హాస్టల్‌లో మెస్ కూడా కట్టేసివుంటారు. మాధవితోబాటు మహారాణీపేట వెళదామా? అనుకుంటూవుండగా 'హల్లో మాధవీ' అంటూ ఎవరో విష్‌చేశారు. మాధవి సంతోషంగా మళ్ళా విష్‌చేసి "వీరే డాక్టర్ అల్‌ఫ్రెడ్ - మీట్ మీ మై ఫ్రెండ్ మిస్టర్ కిరణ్ ఎం. ఎస్‌సి. (ఈయన నా మిత్రుడు కిరణ్ ఎం.ఎస్‌సి.) అని పరస్పరం పరిచయంచేసింది. మాధవి తల్లికి నేత్రవైద్య చేసినప్పుడు అల్‌ఫ్రెడ్ దంపతులు బాగా పరిచయమైనారట. అప్పటి పరిచయం క్రమంగా ఫామిలీ ఫ్రెండ్‌షిప్‌గా మారిందట - 'రండి' అని మమ్మల్నికూడా ఆహ్వానించి అల్‌ఫ్రెడ్ దగ్గరలోని ఒక హోటల్‌కు నడిచాడు - వారివెంట మాధవి, మాధవి వెంట నేను.

అల్‌ఫ్రెడ్ సొంతగొడవ ఏదో చెప్తున్నాడు.

నలుగురం నాలుగు కుర్చీలలో కూర్చున్నాము - మిసెస్ అల్‌ఫ్రెడ్ నాకు ఎదురుగా కూర్చున్నది. వాళ్లు ఏదో ఇంగ్లీషు పిక్చర్ చూచివచ్చారు - అందులోని క్రైంగూర్చి సెక్సుగూర్చి మిసెస్ అల్‌ఫ్రెడ్ వర్ణిస్తున్నది. ఆమె అర్ధనగ్నంగా కేబారా నృత్యానికి తగ్గట్లు దుస్తులు అలంకరించుకుంది. నిత్యజీవితంలోనే-

ఛలోక్తులు విసురుతూ మత్తుగా నావైపు తమాషాగా చూస్తుంటే నా మనస్సు ఏదేదో అయిపోయింది. సర్వర్ నాలుగు గ్లాసుల పానీయాన్నీ తెచ్చి టేబిల్‌మీద పెట్టాడు - మిసెస్ అల్‌ఫ్రెడ్ నాగ్లాసుకు తనగ్లాసు తగిలించి నా ఆరోగ్యాన్ని కోరుతూ ఆ పానీయం తాగుతున్నట్లు అంగ్లంలో చెప్పి సిప్ చేయడం మొదలుపెట్టింది - ఆమెతోబాటే అల్‌ఫ్రెడ్, అల్‌ఫ్రెడ్‌తోబాటు మాధవీ-

నేనిప్పుడు తాగకపోతే అదేం అనాగరిక ప్రవర్తన అనుకుంటారో మాధవీ, మిసెస్ అల్‌ఫ్రెడ్, అని గ్లాసు ఎత్తుకున్నాను - భరించలేని వాసన-

కొంచెం సిప్‌చేశాను. కుంకుడుకాయ రసంలా వుంది. అసహ్యతను కన్పడనీయకుండా మిసస్ ఆల్‌ఫ్రెడ్ కళ్ళల్లోకి చూస్తూ మొత్తం గడగడ తాగేశాను.

ఆల్‌ఫ్రెడ్ బిల్లు చెల్లించాడు.

మిసెస్ ఆల్‌ఫ్రెడ్ నాకు షేక్ హాండ్ ఇచ్చి 'పరిచయం పెరగాలంటే వస్తూ పోతూవుండాలి. తీరినప్పుడు రండి' అని నన్ను ఆహ్వానించింది.

ఆమె కరస్పర్శతో నా మనస్సు జల్లుమన్నది. శరీరంలో, నరాల్లో, మెదడులో ఏదో తెలియని మత్తు - సరికొత్త ఉద్రేకం.

ఆల్‌ఫ్రెడ్ దంపతులు వెళ్ళారు.

మాధవి రిక్షా మాట్లాడింది.

ఇద్దరం ఎక్కాము.

మాధవి మెడచుట్టూ చేయివేసుకొని కూర్చున్నాను.

నేనేదో మాట్లాడుతున్నానని నాకు తెలుసు.

కాని ఏం మాట్లాడుతున్నానోమటుకు తెలియడంలేదు.

ఏం చేస్తున్నానోకూడా తెలియడంలేదు. అతిగా ప్రవర్తించానేమోమరి "ఇది రిక్షా" అని చిరుకోపంతో మాధవి నా చేతిని తన మెడమీదినుండి విడిపించుకున్నది.

రిక్షా మహారాణిపేట చేరడం, ఇంట్లోకివెళ్ళి మంచంమీద పడటం లీలగా గుర్తున్నాయి.

అంతే! ఒక్కటేమత్తు - ఒకటేనిద్ర.

x x x x

అప్పటినుంచి తరుచు కొంచెం పుచ్చుకోవాలనిపించేది. మాధవిమాత్రం మందలించేది.

ఒకటి రెండుసార్లు గట్టిగా తిట్టిందికూడాను.

"నాకీ తాగుబోతుతోనా చివరకు పరిచయం లభించింది" అన్నది ఒకసారి.

"మాధవీ! నేను తాగుబోతునైతే అందుకు నీవే కారణం - మీ ఆల్‌ఫ్రెడ్ దంపతులే కారణం" అన్నాను నేను.

ఆమె కోపంతో, తోకపై లేచిన నాగినిలా విజృంభించింది.

"కిరణ్ - నేనెదో ఆదర్శాలను వల్లించకపోవచ్చు కాని నీచానికి మాత్రం దిగజారను. ఆల్‌ఫ్రెడ్‌మీద నాకున్న గౌరవంకొద్దీ, కొద్ది ఆల్కహాల్ ఒకపూట తీసుకున్నామని నిత్యం తాగుతూవుండాలా? ఎప్పుడైన సభ్యతకోసం సంస్కారం కోసం మిత్రులతో కలసి తాగడంవేరు - కాక్‌టైల్ పార్టీలలో పాల్గొనడంవేరు- ఇలా నిత్యం దేవదాసుగామారి దొర్లడంవేరు - మనః మీద మనకే అంత స్వాధీనం లేనప్పుడు ఇతరులమీద ఎలా వుంటుంది?"

ఆ తర్వాత ఎప్పుడైనా మాధవికి తెలియకుండానే తాగుతూ వుండేవాడిని.

ఒకనాడు గురూజీ నన్ను పిలిచి గట్టిగా చెప్పారు "కిరణ్ - నీవిక మాధవి ఇంటికి వెళ్లనక్కరలేదు" అని-

"మరి నేత్రచికిత్స"-

ఆయన నన్నొక వింత జంతువును చూచినట్లు చూచారు - కొంచెం ఆగి అన్నారు. "నీవేమి కళ్ళవైద్యుడివా రోజూ వెళ్ళడానికి? చంద్రమ్మ మీ బంధువుల మనిషా? ఏమిటి అంత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడానికి"-

"బాంధవ్యానిదేముంది గురూజీ - లోకమంతా మనకు బంధువులే అంతా ఆత్మబంధువులే."

"అలాగయితే మరికొన్ని జాలారి కుటుంబాలను చూపిస్తాను - వాళ్ల నీవంటి సేవాపరుల సహాయాన్ని ఆపేక్షిస్తున్నారు - అనాధలు - కుంటివాళ్లు - గుడ్డివాళ్ళు - కుష్ఠువ్యాధి పీడితులు - వెళ్ళువుగాని రోజూ సేవచేయడానికి"-

నేనేమీ జవాబు చెప్పలేకపోయాను-

దానితో భయం పట్టుకుంది. మాధవి ఇంటికి వెళితే స్వామీజీకి ఎక్కడ కోపం వస్తుందేమోనని-

రెండురోజులు వూళ్ళోకి వెళ్ళలేదు హాస్టల్ విడిచి. మూడోరోజు వెళ్ళ కుండా వుండలేకపోయాను - బాగా చీకటిపడ్డాక మహారాణిపేట బయలుదేరాను- వెళ్ళి తలుపుతట్టాను - ఇల్లంతా చీకటి.

రెండు మూడు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి-

"మాధవీ" పిలిచాను-

వంటగదిలోనుండి మాధవి వచ్చింది.

నన్ను చూచింది-

ఒక్కక్షణం అలాగే నిలబడి పోయింది.

"రండి" అన్నది మెల్లగా
లోపలికి నడిచాను.

"ఉండండి టిఫిన్ తెచ్చి ఇస్తాను".

'ఇప్పుడు టిఫిన్ ఏమిటి? - వచ్చేటప్పుడు కాంటీన్‌లో తిని వచ్చాను'.

ఆమె మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళింది - నేను ఓ పది నిమిషాలు చూశాను - పదిహేను నిమిషాలు చూశాను - లేచి కిచెన్‌లోకి వెళ్ళాను.

కొవ్వొత్తుల వెలుగులో స్టౌమీద మాధవి వంటచేస్తున్నది.

కొవ్వొత్తినుండి జారే వెచ్చటి బిందువుల్లా మాధవి కళ్లవెంట నీటిబొట్లు.

'మాధవీ'

ఆమె వెనుదిరిగిచూచి మళ్ళీ తల వంచుకున్నది.

వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

'మాధవీ - ఎందుకు ఏడుస్తున్నావు?'

'ఎందుకు మీరీ రెండు రోజులనుండి రాలేదు'

జరిగినది చెప్పాను.

'ఔను-స్వామీజీ నిన్న ప్రార్థనామందిరంలో నాతోనూ అన్నారు-కిరణ్‌తో కలసి తిరగకూడదు - చదువు సంధ్యా లేకుండా అతడు చెడిపోతున్నాడు - అని'

ఈ మాటలు చెపుతున్నప్పుడు ఆమెగొంతు గద్గదికమైంది.

'మాధవీ! మనకింక భయమెందుకు? స్వామీజీతో నేమిటి? అందరితోనూ చెప్పివేస్తాను మనం భార్యాభర్తలం కాబోతున్నామని నీతికి - నిజాయితీకి, భయమెందుకు??'

'కిరణ్‌జీ - కిరణ్ - కిరణ్'

ఆమె ఆవేశంతో నా మెడచుట్టూ రెండుచేతులూవేసి నన్ను గుండెలకు హత్తుకుంటూ అన్నది.

'అదంత సులభంకాదు - స్వామీజీ దయలేనిదే నా తల్లి కళ్ళు బాగు పడవు - ఆయనకు కోపం వచ్చిందా మాకు ఉన్న కళ్ళుకూడా పోతాయి-నేనేం చేయను కిరణ్? - అసహాయురాలిని అబలను'.

మాధవి వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

భయం వేసింది. మాట మార్చడంకోసం అన్నాను

"ఇల్లంతా చీకటిగా వుందేమిటి? ఫ్యూజ్ పోయిందా?"

'లేదు - బిల్లు కట్టలేదని కరంటువాళ్ళు డిస్-కనెక్ట్ చేసిపోయారు'.

మాధవి ఆర్థిక దుస్థితి చీకటిలా ఇల్లంతా వ్యాపించిందని నాకిప్పుడు అర్థమైంది.

'ఎవరూ వచ్చింది?' నిద్రలేచి కళ్ల నులుముకొంటున్నది చంద్రమ్మ.

'నేనమ్మా - కిరణ్‌ను'.

'రాలేదేం నాయనా - రెండు రోజులుగా'.

'ఏదో పనివుండి'.

'ఆ పాపిష్టివాళ్ల కరంటుబిల్లు వస్తుకు కడతామన్నా వినకుండా తీగతెంపి వెళ్ళారు నాయనా'. గుడ్డిదాన్ని. చీకటి వెలుగూ నాకు రెండూ సమానమే. కాని అమ్మాయి నిన్నటినుండి ఒక టే గోల - ఏ పనిచేసుకోవడానికీ కొవ్వొత్తులతో కన్ను పొడుచుకున్నట్లుగా వున్నదంటున్నది.

'ఫరవాలేదమ్మా - రేపు నేను కట్టవస్తాలే' కొవ్వొత్తితో షెల్ఫ్ వెతికాను. టైంపీస్ వక్కనే కరంటుబిల్లు వుంది. తీసుకున్నాను.

కాసేపు ఏవో అవీ ఇవీ మాట్లాడింది చంద్రమ్మ.

'వస్తానమ్మా' లేచాను.

'మంచిది నాయనా-మమ్మల్ని నువ్వుకూడా మరచిపోతే మా గతేంకాను?'

జోళ్లు వేసుకున్నాను.

మాధవి వచ్చింది

ఆమె కళ్ళల్లోకి చూచాను.

నా కాలర్ సరిచేస్తూ అన్నది 'దయచేసి స్వామీజీకి కోపం తెప్పించకండి- నన్ను మరచిపోండి - కనీసం కొంతకాలమయినా'

'మాధవీ'

'కిరన్ - ఆవేశపడకు! నాకు మన జీవితమెంత ముఖ్యమో తల్లి కళ్లు బాగుపడటమూ అంతే ముఖ్యం' మాధవి బాధగా అన్నది.

నేన్ను భిన్నుణ్ణి అయిపాను - ఆమెనలా చూస్తూ మెల్లగా నడుస్తూ రోడ్డు మీదికి వచ్చేశాను.

గుమ్మందగ్గర నిలబడి నన్నలా చూస్తూవున్నది. నేను తనమాటకు వ్యతిరేకంగా ఇక్కడికి వచ్చానని స్వామీజీకి తెలియదా? తెలిస్తే కోపగిస్తాడేమో.

అసలే మంత్రవేత్త - చివరకు నా బ్రతుకిలా మాయల మరాఠీగాళ్ళ చేతిలో పడిందేమిటా? అనిపించింది.

బస్సెక్కాను.

మెస్‌కు వెళ్ళబుద్ధిపుట్టలేదు.

రూం చేసేసరికి వెంకటరెడ్డి శ్రద్ధగా చదువుకుంటూ వున్నాడు.

నన్ను చూచి మళ్ళీ తలదించుకొని తన చదువులో పడిపోయాడు.

నేనేదో తప్పు చేసినవాసిలా మాట్లాడకుండా నా దోమ తెరలోకి దూరాను.

గట్టిగా కళ్లుమూసుకున్నాను.

నిద్రరాలేదు.

లేచి బయట వరండాలో కాసేపు పచార్లుచేశాను మళ్ళీ.

లోపలికివెళ్ళి మంచంమీద కూర్చొని అన్నాను 'రెడ్డీ - లైటుతీసేద్దూ నిద్ర రావడంలేదు'.

వెంకటరెడ్డి లైట్ ఆఫ్‌చేసి తన టేబిల్‌లైట్ వెలిగించుకున్నాడు.

ఆ లైట్ కాంతినికూడా భరించలేకపోతున్నాను.

కొంచెం ఆగి వెంకటరెడ్డి అన్నాడు.

'కిరణూ - ఇదేం బాగుండలేదు.

నేను కళ్ళుమూసుకొని నిశ్శబ్దంగా వింటున్నాను.

'నీవసలు బొత్తిగా చదవడంలేదు - నిన్న ప్రొఫెసర్‌కూడా కామెంట్ చేశాడు. నీవేదో రికార్డుబ్రేక్ చేస్తావని ఆయన మొదట నీ ప్రోగ్రెస్ చూచి ఆశ పెట్టుకున్నాడట-ఇదేమిటి ఇట్లా అట్లా అయిపోయినాడు ఈ పిల్లగాడు అంటున్నాడాయన - ప్రొఫెసర్స్ మొదట్లోనే ఇంప్రెషన్ ఫార్మ్ చేసుకొంటారు. అప్పుడే జాగ్రత్తగా వుండాలి. ఆ తర్వాత ఎంత చదివిగా లాభంలేదు'.

నా గుండెలు దడదడలాడాయి.

'ఆయన అనేదేందిలే -నాకుమాత్రం తెలియదంలా', ఈ తిరుగుళ్ళేమిటి? సినిమాలేమిటి? తెల్లవార్లూ పూళ్ళో పడుకోడమేమిటి? నువ్వసలు చదువుకునేందుకేనా ఇక్కడికి వచ్చింది'.

'రెడ్డి'

'కిరణూ - నామాటలు నీకు బాగుండవు-నిజం నిష్టూరంగానే వుంటుంది. ఏంచేయ్యను? మనమేం లక్షాధికారులంకాదు జల్సాలుచేయడానికి - ఈ చదువుమీద

మన భవిష్యత్తు ఆధారపడివుంది - నీవు దాన్ని ఈ సంవత్సరమే ఇట్లా నెగ్లెక్ట్ చేస్తున్నావంటే ఇదేదో గ్రహచారమనిపిస్తున్నది. నేనేం చెప్పనబ్బా నీకు ఇంతకంటే'.

'నాకేం చెప్పనక్కరలేదు'

వెంకటరెడ్డి నా మాటకు షాక్ తిన్నట్టు టేబిల్ లైటు వెలుగులో ఆ ముఖాన్ని నేను గుర్తించాను

అతను మరింక మాట్లాడలేదు.

నేను నిశ్శబ్దంగా దోమ తెరలోకి దూరి గట్టిగా కళ్ళుమూసుకున్నాను.

కళ్లు మూసుకున్నా తెరిచినా మాధవే కనబడుతున్నది-చీకటిలో చంద్ర బింబంలా ఆమె ముఖం - కరంటుబిల్లు రాహువులా కన్పడింది.

ఏమైనాసరే రేపు కట్టితీరాలి.

ఎలా?

నా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే వుంది!

మెస్ బిల్లునే బకాయి పెట్టాను-

'ఛీ! ధనంలేనివాళ్ల ప్రేమించకూడదు - ఇది చాలా కాస్ట్లి లక్జరీ. నాబోటి పేదవాళ్లు ప్రేమకు అనర్హులు' అనుకున్నాను - అలా ఎప్పుడు నిద్రపట్టిందో-

ఎంతరాత్రి అయిందో నాకే తెలియదు-

మర్నాడు బాగా ఆలస్యంగా లేచాను - అప్పటికే రెడ్డి స్నానాదులన్నీ ముగించుకొని టిఫిన్ చేసి వచ్చాడు.

నేనలా పక్కమీదనే దొర్లుతున్నాను.

రెడ్డి పెట్టెతీసి రూపాయలు లెక్కబెట్టుకుంటున్నాడు.

పదిరూపాయల నోట్లు మెస్ బిల్లుకేమో మరి ఓ కట్ట జేబులో పెట్టుకొని మిగిలినవి ఇస్త్రీపాంటు మడతల మధ్యపెట్టి పెట్టె దగ్గరగావేసి డ్రస్ చేసుకొని ప్రాక్టికల్స్‌కు బయలుదేరుతున్నాడు.

అర్జంటుగా డబ్బు కావాలని మొన్ననే ఇంటికి జాబు వ్రాశాను. దానికి జవాబు రాలేదు - డబ్బు దుబారా చేస్తున్నానని తిట్టుకొనైనాసరే నేడో రేపో వాళ్లు తప్పక పంపుతారు - తల తాకట్టుపెట్టైనా-

నాకా నమ్మకముంది.

ఈలోపల వెంకటరెడ్డి పైకం వాడుకొని మళ్ళీ ఎరగనట్లు పెట్టేస్తే తప్పేమిటని తోచింది.

నా ఆత్మ నా చెంపమీద ఛెళ్ళున కొట్టినట్లనిపించింది.

ఏ.పి.యు.పి.కి ముందో రావలసిన బలహీనమైన ఆలోచనలు ఎం ఎస్సి. స్థాయిలో వస్తున్నాయి.

నాకు తెలియకుండానే నేను మానవత్వంనుంచి పశుత్వానికి దిగజారి పోతున్నానని నాకు తెలిసింది.

కాని ఈ పతనాన్ని తట్టుకోని నిలబడటం ఎలా?

పైకి తిరిగి అధిగమించడం ఎట్లా??

రెడ్డి వెళ్ళాడు.

నేను లేచి ఓ నలభై రూపాయలు తీసుకున్నాను.

భద్రంగా పెట్టెను మళ్ళీ మూత పెట్టాను.

హడావుడిగా స్నానాదులు ముగించుకోని డ్రస్ చేసుకోని వూళ్ళోపడ్డాను.

'ఎలక్ట్రిసిటీ ఆఫీసుకెళ్ళి కరంటు బాకీ చెల్లించి హోటల్లోనే భోంచేసి మహారాణిపేట వెళ్ళాను - తలుపు కొట్టాను.

'ఎవరూ' చంద్రమ్మ కేక.

'నేను - కిరణ్‌ను'

చంద్రమ్మ తడుముకుంటూ వచ్చి తలుపు తీసింది.

'ఎక్కడినుంచి నాయనా రావడం'

'కరంటు బిల్లు కట్టి వస్తున్నానమ్మా-మాధవి లేదా'

'లేదు బాబూ డ్యూటీకెళ్ళిది-నాయనా నీకు అనవసరంగా శ్రమ ఇస్తున్నాము-ఇనుముతో బాటు అగ్నికి సమ్మెట పెట్టు అన్నట్లుంది'.

'లేదమ్మా-నా బాధ్యత నేను నిర్వహిస్తున్నాను-' అంటూ, చేయి సహాయం పట్టుకుని తీసుకెళ్ళి మంచంమీద కూర్చోబెట్టాను.

'బాబూ ఆ షెల్ఫ్‌లో ఫైలు వుంటుంది. కరంటుబిల్లు అందులో పెట్టు నాయనా గుర్తుగా'

అలాగే షెల్ఫుతీసి ఫైలులో పెట్టాను-తిరిగి ఫైలు పెట్టేస్తూ కింద ఆల్బం ఉంటే ఊరికే తిరగేశాను.

అందులో ఓ కార్డుసైజు ఫోటో....మాధవీ, మరెవరో డాక్టరూ.

కళ్ళు బైర్లు కమ్మినట్లైంది ఒక్క క్షణం

అనుమానం

అవమానం.

కళ్ళనుండి అగ్నిధారలు.

మస్తిష్కంలో లావా జలపాతాలు.

ఫోటోలని జేబులో పెట్టుకున్నాను.

షెల్ఫు మూసివేశాను మళ్ళీ.

బయలుదేరాను.

'వెళ్తున్నావా బాబూ' అడుగుల చప్పుడుతోనే గుర్తించింది చంద్రమ్మ.

'ఆఁ'. అంతకంటే మరేమాటా రాలేదు నోటివెంట.

ఎండలో వెళ్ళి బస్సెక్కి హాస్టల్‌కు చేరాను.

నగరమంతా స్మశాన వాటికగా, విశ్వవిద్యాలయం నిర్జీవంగా అనిపించింది కనిపించింది.

గదిలోనూ ఉండలేకపోయాను.

క్లాసుకు వెళ్ళాలని అసలే బుద్ధి పుట్టలేదు.

మళ్ళీ యూనివర్శిటీ బయటకువచ్చి బస్సెక్కాను. పెద్ద పోస్టాఫీసు దగ్గర దాని టర్మినస్.

అలా పోయాను చివరిదాకా.

అంతా దిగిపోయారు.

టెర్మినస్ వచ్చిందని చెప్పాడు కండక్టర్.

'మళ్ళీ బయలుదేరుతుంది కదా యూనివర్సిటీకి' అన్నాను.

అయితే ఎందుకు బస్సెక్కినట్లని అనుమానం వచ్చినట్లుంది కండక్టరుకు.

నన్ను అనుమానంగా చూస్తున్నాడు.నేను హాస్టల్ నుండే వచ్చానా లేక గోడ అవతలనుండి తప్పించుకొని వచ్చానా అని.

'ఈ బస్సు ఇప్పుడే బయలుదేరదు సార్.ఇంకా టైం వుంది.దిగండి.'

దిగక తప్పలేదు.పరిభ్రమిస్తున్న నా మనస్సు బస్సులో అటూ ఇటూ నడుస్తున్నది ముందుకూ మళ్ళీ వెనకకూ.

తొలిసారి నాకు ఆత్మహత్య భావన మనస్సులోకి ప్రవేశించింది.

ఏవో నేను కట్టుకున్న భవనాలు పునాదులతో కూలి శిథిలాలుగా మారుతున్నట్లు గట్లు పెళ్ళలుగా విరిగిపడ్డ సరోవరంలోని హంసలన్నీ వరదలో కొట్టుకొని పోతున్నట్లు, బోయవాడి బాణం దెబ్బతో గుండెపగిలిన లేడి రక్తం కక్కుతూ విలవిలలాడుతున్నట్లు-

పచ్చిపచ్చిగా, పిచ్చిపిచ్చిగా భావనలు-చిక్కుబడిన దారపు వుండలాగా తగలబడుతున్న తాటాకుల గుడిసెలాగా-

దప్పికతో సహారా ఎడారిలో మండుటెండాకాలంలో రాలిపడ్డ పిట్టలాగా.

సముద్రంనుండి ఒడ్డుకు వలతో గుంజి పడేసిన చిరుచేపలాగా బలహీనమైన భావనలు.

జీవన్మరణ సమస్యతో ప్రాణి విలవిలలాడుతున్న దశలోని భావనలు.

నిజంగా నాకు పిచ్చెక్కినట్లే వుంది. లేకుంటే ఆ తిరుగుడేమిటి సందులూ గొందులూ గతిగమ్యం లేకుండా తిరిగాను నాలుగుగంటలు - చీకటి పడింది.

విద్యుద్దీపాలు వెలిగాయి-

బస్సెక్కి తిరిగి యూనివర్శిటీ చేరాను. వస్తుతాచ్‌లోనే భోజనానికి వెళ్ళాను. అన్నం విషంలా అనిపించింది.

మాధవి అన్నంలో, కూరలో, సాంబారులో, విస్తరిలో కనిపిస్తున్నది.

బంగాళాదుంప చిప్స్ చేశారు ఈ పూట.

ప్రతి ముక్కలోనూ డాక్టరు ముఖం.

డాక్టరు నవ్వు.

డాక్టరు పరిహాసం-

కసికసిగా కరకరా చిప్స్ మొత్తం మళ్ళీ మళ్ళీ వేయించుకొని నమిలాను.

నాపక్కన కూర్చున్నవారు, నేను తిండితింటున్న పద్ధతిలో ఏదో అసహజత్వం కన్పడుతున్నది - ఓరగా నన్ను చూస్తూ భోంచేస్తున్నారు-

అన్నం విసిరి వాళ్ళ ముఖాన కొట్టాలనిపించింది - అయినా సభ్యతకాదని నిగ్రహించుకొని లేచి చెయ్యికడుక్కున్నాను.

స్వామీజీ గదికి బయలుదేరాను-

గదికి బయట నటరాజన్ కూర్చొని ఉన్నాడు.

"హల్లో కిరణ్ - రా - రా - అరే... అదేమిటయ్యా ముఖమంతా అట్లా గయింది?" తెలుగులో ఇంగ్లీషులో తమిళంలో వరుసగా నాపై సానుభూతి వర్షం కురిపిస్తున్నాడు.

'స్వామీజీ లేరా'

'వస్తున్నాను కిరణ్' లోపలనుండి గురూజీ వచ్చారు.

లోపలేదో మీటింగు జరుగుతున్నది - చటర్జీ గొంతు గట్టిగా వినపడు తున్నది.

పాత్రోకూడా అరుస్తున్నాడు, 'సమ్మె జరగాల్సిందే. తిరుగులేదు.'

చిదంబరరావు గట్టిగా నిట్టూర్చి నటరాజన్‌తో అన్నాడు 'పిల్లలు బాగా ఉద్రిక్తులౌతున్నారు - ఎవడో బస్ కండక్టరు టిక్కెట్టు కొనలేదని ఓ స్టూడెంటును మందలించాడట. అతడు వాడిపై చెయ్యిచేసుకున్నాడు వెంటనే డ్రైవరు బస్సును తీసుకెళ్ళి పోలీసుస్టేషన్ ముందుపెట్టాడు - పిల్లవాణ్ణి పోలీసులు పట్టుకొని మందలించారు - రెండు తగిలించారని కూడా ఒక వెర్షన్ ఏది నిజమో ఎవడికి తెలుసు - విద్యార్థులంతా సమ్మె ప్రయత్నాలు చేస్తున్నారు - నేను ఎలాగైనా చల్లార్చి పంపాలని ప్రయత్నిస్తున్నాను - ఏమిటో ఖర్మ' - అని కొంచెం సేపు ఆగారు. నన్ను చూచి 'ఏం అలా వున్నావు కిరణ్ - చూడరానిదేదో చూచి నట్లు వినరానిదేదో విన్నట్లు-ఏమైంది?'

ఉలిక్కిపడ్డాను నేను.

'ఏమీలేదు స్వామీజీ! మనస్సెందుకో బాగాలేదు నిద్ర పట్టడంలేదు. రాత్రిళ్ల'.

చిదంబరరావు నవ్వి 'అది వయస్సు లక్షణం అబ్బాయ్ - నీ తప్పేం కాదు'- అని లోపలికి వెళ్ళి ఏదో మూలిక తెచ్చి ఇచ్చాడు - 'పడుకోబోయే ముందు ఇది తిని పడుకో - ప్రశాంతంగా నిద్రపడుతుంది' అన్నాడు.

'స్వామీజీ నాకు ఇవ్వండి అలాంటిదేదైనా' నటరాజన్‌కూడా అడిగాడు.

'నీకెందుకయ్యా అది కేవలం ఇలాంటి విద్యార్థుల కోసమే ఉపయోగిస్తాము-నీవు ఎంప్లాయీవి కదా, కాబట్టే నీ సమస్యలు వేరు-వాటికి పరిష్కారాలూ వేరు-'

నటరాజన్ భక్తితో నమస్కరించాడు 'గుర్వాజ్ఞ' అన్నట్లు-

నేను రూం దగ్గరకు వెళ్ళాను.

లోపల వెంకటరెడ్డి చదువుకుంటున్నాడు.

నాకేదో భయం పట్టుకుంది.

లేని ధైర్యం కూడదీసుకుని వెళ్ళాను లోపలికి.

వెంకటరెడ్డి నన్ను చూచి మళ్ళీ పుస్తకంలో లీనమైపోయాడు.

ఏమీ మాట్లాడలేదు.

నేనూ లుంగీ కట్టుకుని మంచంమీద కూర్చున్నాను.

'కిరణ్.ఇవ్వాళ నీ స్నేహితుల కెవరికైనా తాళం చెవి ఇచ్చావా'

గుండె ఝల్లుమంది.

తాళం చెవులు రెండూ మా ఇద్దరి దగ్గరా చెరొకటి వున్నాయి.

'లేదు.ఎందుకు?'

'ఆఁ.ఏం లేదులే.ఎవరైన రూముకు వచ్చారేమోనని' వెంకటరెడ్డికి తెలిసి పోయింది నేనే తీశానని!

'ఎందుకా అనుమానం వచ్చింది?' అనుమానం నిజంగా నాకు.

"ఏమీలేదు.పుస్తకాల షెల్ఫుఎవరో అటూఇటూ చేసినట్టున్నది.ఏదైన బుక్ తీసుకున్నావా?

'లేదు' దబ్బుమాట ఎత్తలేదు వెంకటరెడ్డి. 'తీసుకున్నాను' అని చెప్ప లేకపోయాను నేను ఎవరో నాగొంతు నులిమినట్లు

శిరచ్ఛేదనం చేసినట్లు

ఛీ! ఏమి బ్రతుకిది.

వెంకటరెడ్డి మళ్ళీ మరొకమాట కూడా మాట్లాడలేదు. పుస్తకంలో మునిగి పోయాడు.

మాట్లాడినా బాగుండేది.

గట్టిగా నాలుగు చీవాట్లు పెట్టినా మనస్సుకు తృప్తిగా వుండేది.

ఈ నిశ్శబ్దంతో నన్ను ఉరితీసివేశాడు రెడ్డి. అతని మంచితనం పాల సముద్రంలా ముంచివేసింది నన్ను.

పాలైనా సముద్రమేగా.

మునిగి వూపిరాడక ప్రాణవాయువు కోసం గిలగిలలాడుతున్నాను

చేతిలోని స్వామీజీ ఇచ్చిన మూలికను నమిలాను.అదేదో మట్టి వాసన వచ్చింది.

మూలిక నమలుతుంటేనే మత్తు తెరలు తెరలుగా మొదలైంది.

ఇది బ్రాందీ మత్తుకన్నా నూరింతలు బలంగా వుంది.

అలా ఒళ్ళు తెలియకుండా మంచం పైకి జారాను. తర్వాత ఏమైందో నాకే తెలియదు.

ఎన్నడూ ఎరగని సరికొత్త మత్తు.

వేయి యేనుగలంతమత్తు.

కుంభకర్ణ డిలాంటిమత్తు.

ఏమైతేనేం. మానసికమైన బాధనుమరచి పోయాను తాత్కాలికంగా.

శోభను కొన్ని గంటలైనా విస్మరించాను. వాయిదా వేశాను. మర్నాడు తెల్లవారాక మంచం మీదలేచికూర్చుంటే ఒళ్ళంతా రోకలితో నలగబొడిచినట్లు ఒకటే నొప్పి. నరాలన్నీ గుంజుతున్నాయి—

ఎముకల్లో ఒకటే సలుపు

కిటికీ గుండా చూచాను.

సూర్యుడు నడినెత్తికి కొంచెం తక్కువగా వున్నాడు. షెల్ఫులో వాచ్ తీసి చూచాను పదకొండున్నర.

రెండో ఆట సినిమాకు వెళ్ళిన రోజుల్లో కూడా ఇలాంటి మొద్దునిద్ర పట్టడం నేనెరుగను.

లేచి ముఖం కడుక్కోడానికి బ్రష్ పేస్టు తీసుకున్నాను - చేతులు గుంజాయి.

లేచి నాలుగడుగులు వేయలేకపోయాను. ఒక్కరాత్రిలో ఓ ఆరునెలల బలాన్ని కోల్పోయినట్లు గుర్తించాను.

ఓ నాలుగు చొక్కాల నీళ్లు పోసుకొని మెస్‌కు వెళ్ళేసరికి మొదటిబాచ్ సిద్ధంగావుంది.

ఎందుకనో అన్నం కూడా సయించలేదు.

బయట పోలీసు కాపలా. పిల్లలు గుంపులు గుంపులుగా అక్కడక్కడ తిరుగుతున్నారు. అక్కడ వారి సంభాషణనుబట్టి సమ్మె ప్రారంభమైందని గమనించాను.

విద్యార్థులు క్లాసులకు పోవడం విషయంలోనే సమ్మె. ఉద్యోగులు 'వర్క్ టు రూల్' అంటూనో 'పెన్ డౌన్ స్ట్రయిక్' అంటూనో పనిచేయడం దగ్గరే సమ్మె....

... ఉపాధ్యాయులు జీతాలు డి.ఏ.లు పెంచాలంటూ సమ్మె అంతేకాని వర్క్ మరి కొంచెం పెంచమని సమ్మె చేసిన ఉద్యోగస్థుణ్ణి, సిలబస్ మరికొంచెం కావాలని సమ్మె చేసే విద్యార్థిని నేనీ విద్యార్థి జీవితంలో చూడటంలేదు.

క్లాసు రూములవద్ద సమ్మెకాని

హాస్టల్‌లో మెస్‌వద్ద సమ్మెలేదు.

భోజనాలు యథాప్రకారం షడ్రసోపేతంగా సాగిపోతూనే వున్నాయి.

భోజనం ముగించి అశోకవర్ధన దాకా వచ్చేసరికి పాత్రో ముఖర్జీ స్వామీ, హాస్టల్‌లో గది గదికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టి ఏదో కేన్వాసు చేస్తున్నారు.

ఊరేగింపు వుంటుందనో. లేక అర్.టి.సి. వారు, ఆ డ్రైవరూ కండక్టర్లపై చర్య తీసుకొని విద్యార్థిపై కేసు ఉపసంహరించేంతవరకు ఊరుకునేది లేదనో ఏదో చెపుతున్నట్లుంది.

గది చేరేలోగానే మరోవార్త.

ఆర్ టి.సి యూనియన్‌కూడా దానిని తమ 'గౌరవప్రతిష్ఠల విషయంగా తీసుకొని సమ్మె మొదలుపెట్టి బస్సులనన్నీ ఉపసంహరించివేశారట.

ఒకటే గందరగోళం. కల్లోలం.

నా మనస్సులాగేవుంది బయటి ప్రపంచం కూడా.

నేడు కూడా మనిఆర్డర్ రాలేదు.

వెంకటరెడ్డికి ముఖం ఎలాచూపను?

గురూజీ అనుగ్రహించి ధనమేదయినా యిస్తాడా??

ఒకసారి పూళ్ళోకివెళ్ళి మాధవిని చూస్తే బాగుండును - ఛీ! ఆ రాక్షసిని చూచేదేమిటి??

అయినా అంత తొందరపాటు మంచిదికాదు - అతను ఎవరో ఏమిటో తెలియకుండా ఎందుకంత అపోహ!

నిజం సుమా!

ఈ భావం రాగానే మళ్ళీ మాధవిమీద ఒక విధమైన ప్రేమ ప్రారంభమైంది.

మానవుడు సృష్టిలోకెల్లా విచిత్రమైన జీవి - మిగిలిన జీవజంతువులు లోకవంచన చేయడంలో అందెవేసిన చేతులు.

మానవుడో - లోకవంచనతోబాటు ఆత్మవంచననుకూడా సవ్యసాచిలా చేస్తాడు చేసుకుంటాడు.

కాస్త చల్లబడ్డాక సముద్రం ఒడ్డునే నడుచుకుంటూ రామకృష్ణా మిషన్ మీదుగా ముందుకుసాగి కలక్టరేటు వైపుకు వెళ్ళాను-ఇంతాచేసి మాధవి ఇంటికి వెళ్ళబుద్ధి పుట్టలేదు ఎందుకో.-రిక్షా ఒకదాన్లో ఎక్కి ఓ పాత సినిమాహాలుకు వెళ్ళి టిక్కెట్టు కొనుక్కొని హాల్లో కూర్చున్నాను

అప్పటికి ఆట మొదలు పెట్టారు.

చాలా వెనుకగావెళ్ళి కూర్చున్నాను-

సెన్సారులేనట్లు సాగుతున్నది రొమాన్స్

ఇలాంటి సన్నివేశాలలో లోగడ మాధవి నా పక్కన వున్నప్పటి హాయి గుర్తుకొచ్చింది.

హాలంతా శృంగార తరంగాల్లో ఓలలాడుతున్నది,

నేనుతప్ప !

నా ముందు భార్యాభర్తలు ఇది థియేటరన్నమాటే మరచి ప్రవర్తిస్తున్నారు.

సినిమాను మించి సాగుతున్నది వాళ్ళ శృంగారం-

ఆదిమానేనీ ఇదే చూస్తున్నాను-

ఇంటర్వేల్ !

లైట్లు వెలిగాయి.

కోకో కోలా, బిస్కెట్,వాళ్ళ కేకలు-

వెల్తురులో చూచాను-

కొయ్యబారిపోయాను-

ముందున్నది మాధవి!

ఆ పక్క వ్యక్తి ఆర్గానిక్ కెమిస్ట్రీకి చెందిన ఓ విద్యార్థి.

నన్ను నేను నమ్మలేక పోతున్నాను-

ఇందాకటినుంచీ నేను చూచింది నిజమా? కలా??

ఉద్రేకంతో లేచి వాళ్ళ సీటుముందుకు వెళ్ళాను-

అతను నవ్వుతూ మాధవితో ఏదో గుసగుసలాడుతున్నాడు

శోభనం గదిలోని కొత్త పెళ్ళి కూతురులా తల వంచుకుని పరవశంతో వింటున్నది మాధవి.

ముందునుంచి నడిచి వెళ్ళిన నన్ను చూడనట్టుంది.

చూడలేదా?

చూడనట్లు నటించింది.

పది వేలమంది ఓథెల్లోను నన్ను ఆవేశించారు.

ఛీ! అసభ్యమైన పోలిక.

డెస్డిమోనాతోనా ఈ అపవిత్రురాలిని పోల్చుకోవడం.

దీనిగొంతు పిసికిచంపాలి.

ముక్కలుచేసి కాకులకూ గద్దలకూ వేయాలి.

ఎక్కడ ? ఎప్పుడు?

హాలులోనుండి బయటకు నడిచాను.

నడుస్తున్నట్లున్నాను

నడుస్తున్నానా??

'ఏమే చస్తావా ఏమిటి?' కారుహారన్ 'బొయ్'మని డ్రైవరు హెచ్చరింపు

నడిరోడ్డుమీది నుండి తూలుకుంటూ రోడ్డుప్రక్కకు దూకాను.

వెంట్రుకవాసిలో ప్రాణాపాయం తప్పింది.

వెధవప్రాణం.

ప్రాణమేమిటి? అపాయమేమిటి??

అసలు నేనే చస్తే ఎంత బాగుండును.

ఇదో కొత్త ఆలోచన.

'చావాలి' అన్న భావంలో కూడా ఇంత 'థ్రిల్' వున్నట్లు ఇప్పుడే గమనిస్తున్నాను.

స్వామీజీ అప్పుడే చెప్పాడు ఇలాంటి బజారుసరుకుతో సంబంధం పెట్టుకోవద్దని.

దాని ఇంటికి పోవద్దని ఆయన నిషేధించింది అందుకే.

నిజమే! ఇదేమి సతీ సావిత్రా, సీతామహాసాధ్వా?

అర్ధాంగితో ప్రవర్తించినట్లు దాని మీద అధికారం చెలాయిస్తే ఎలా కుదురుతుంది?

పెళ్ళికిముందు నాతో అలా తిరిగింది. మరొకడితోనూ, అలాగే సరసాలు కులుకుతుందని ఊహించలేకపోవడం నాదే పొరపాటు.

యూనివర్సిటీ గేటు చేరాను.

ఎక్కడో రెండు బస్సులు విద్యార్థులు అంటించిన వార్తలు.

బయట మంటలు

నా మనస్సులోనూ మంటలు-

విశ్వాస పాత్రుడైన, దాసుడు నటరాజన్ ఇంతటి కల్లోలంలోనూ స్వామీజీ దర్శనానికి కాబోలు వచ్చినట్లున్నాడు గేటు దగ్గరే నిలబడి వున్నాడు.

నన్ను చూడగానే గబ గబ నడుస్తూ దగ్గరికి వచ్చాడు-

'నటరాజన్! స్వామీజీ వున్నారా గదిలో'

'వున్నారు-కాని మీరొకసారి నాతో వూళ్ళోకి రావాలి'

'ఎందుకు?'

'చెపుతాను-'

'నాకు కొంచెం పని వుంది.'

'ఆత్మహత్యగా! దానికేం బోలెడంత జీవితం వుంది-ఎప్పుడైనా ఈ పనికి తీరిక దొరుకుతుందిలే' నటరాజన్ కంఠంలో వెనుకటి సౌజన్యమూ, సౌమ్యతా లేదు-చాలా కరుకుగా కటువుగా వుంది.

ఆత్మహత్యా భావం నాకు వచ్చి ఇంకా పదినిమిషాలు కూడా కాలేదు-ఇతనికెలా తెలిసింది.

నేను మాట్లాడకుండా అతన్ని తప్పించుకొని లోపలికి వెళ్ళబోతున్నాను.

ఇద్దరు పోలీసులు నన్ను చుట్టుముట్టారు.

నేను నిర్విణ్ణునయిపోయాను-

'మంచిగా నాతో వస్తే మంచిది కిరణ్ కుమార్ లేకుంటే బేడీలు తగిలించి తీసుకెళ్ళాల్సి వుంటుంది.'

'నేనేం చెయ్యలేదు-మాధవిని హత్య చెయ్యను-నేనెందుకు చేస్తాను?'

'నీవు చెయ్యవు-చెయ్యలేవు కూడానులే-ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావుగా-అది చాలు పద పోలీసు స్టేషనుకు-'

నటరాజన్ మఫ్టీలో వున్న పోలీసు అధికారి అసి సి ఐ.డి. అని ఇప్పుడే గుర్తించ గలుగుతున్నాను. పోలీసు వాన్‌లో ఎక్కించారు-

విశాఖ పోలీసుస్టేషనుకు తీసుకువెళ్ళారు-

అక్కడ ఒక డాక్టరు మా కోసమేనన్నట్లు ఎదురుచూస్తున్నాడు-

రాగానే నన్ను పట్టుకొని గదిలోకి తీసుకెళ్ళి ఏవేవో పరీక్షలు చేశాడు. ఓ ఇంజెక్షనిచ్చాడు.

గట్టిగా నిట్టూర్చి బయటికివచ్చి 'ఫరవాలేదు హి, విల్ బి ఆల్ రైట్' (ఇతడు బాగుపడతాడు) అని చెప్పాడు పోలీసు అధికారితో.

'మిస్టర్ కిరణ్‌కుమార్-మీ కేది కావాలో చెప్పండి.ఏర్పాటు చేయిస్తాను. భోంచేస్తారా, కాఫీ తీసుకుంటారా?'

'ఏమీవద్దు-నేను నిర్దోషిని-ఎవరినీ చంపాలనుకోలేదు- వదలండి'

'కనీసం చావాలనుకున్నావు కదా'

'అనుకోవడంకూడా నేరమేనా?'

'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్' (రోగనివారణ రోగ నిదానంకన్నా మంచిది)

పోలీసుశాఖ మనుషుల మనస్సుల్లోకి దూరడం ఎప్పుడు మొదలు పెట్టిందేమిటి?

'మీరు ఆవేశంలో వున్నారు-వెళ్ళి విశ్రాంతి తీసుకోండి'

అది విశ్రాంతికాదు. బంధించడం అన్న మాట.

నిన్ను తీసుకెళ్ళి ఓ గదిలో పడేశారు.

బయట కావలా, నేను ఏ అఘాయిత్యమూ చేయకుండా!

రాత్రి అఘోరకమైన నిద్ర పట్టింది.

తెల్లవారాక నటరాజన్ వచ్చాడు.

'హల్లో మిష్టర్ కిరణ్‌కుమార్-కులాసాగా వున్నారా'

నేనేం మాట్లాడలేదు.

'సారీ-ఫర్ ది ట్రబుల్ కాజ్‌డ్ బై మి" (నేనిచ్చిన కష్టానికి క్షంతవ్యుణ్ణి)

"....... ..........."

మీరు ఇవ్వాళే హాస్టల్‌కి వెళ్ళవచ్చు భోజనంవేళకు-మీరు తీసుకున్న మూలికా ప్రభావం నిన్న డాక్టరుగారిచ్చిన ఆంటీడోస్‌తో నశించిందిలెండి.'

'ఏం మూలిక-'

'ఆదే స్వామీజీ ఇచ్చిన విషం'

'అది విషమా?'

'అని కొంచెం ఆలస్యంగా నిర్ధారించుకున్నాను-ఆ నిర్ధారణ జరిగేటప్పటికి మీరు తినడమూ, మాధవిని హత్య చేయాలనికోవడమూ అన్నీ జరిగిపోయాయి.'

'స్వామీజీ విషం ఇచ్చారా?'

'విషమిస్తే అదృష్టవంతుడివే-దెబ్బకు చచ్చేవాడివి-ఇది అంతకన్నా ప్రమాదకరమైంది మతి భ్రంశం కలుగజేసి నిలువునా క్రుంగదీసి పిల్చి పిప్పి చేసి మరీ చంపుతుంది-స్వామీజీ ఇచ్చే ప్రసాదాలన్నీ ఇవే హై పొటెన్సీలో విషాలూ, మార్ఫియాలు, గార్డినాల్స్ ఇలాంటి అడవి మూలికలు.'

'మీరు చేప్పేది నాకు అర్థంకావడంలేదు'

'నీకేమిటిబాబూ మాకు అర్థం కావడానికే ఓ యాడాది పట్టింది-ప్రొ. ముఖర్జీ. స్వామీ వీళ్ళంతా విద్యార్థులు కారు-ఒక దేశపు ఏజంట్లు. విశ్వ విద్యాలయాలలో ప్రవేశం వాళ్ళ వ్యూహంలో ఒక అంతర్భాగం. వాళ్ళ నాయకుడు చిదంబరరావు. నిర్ణీతమైన పథకం ప్రకారం ఈదేశంలోని మేధావివర్గాన్ని ముఖ్యంగా దేశానికి పనికివచ్చే తెలివైన విద్యార్థులను నిర్మూలించడం ఈ కార్యక్రమంలోని ప్రధానాంశం. వాళ్ళను చదువునుండి పక్కకు మళ్ళించడం విషయలోలురుగా మార్చడం, వ్యసనాల కలవాటుచేయడం, మతిభ్రమణం కలిగించడం హత్యలు ఆత్మహత్యలు ప్రోత్సహించడం వాళ్ళ కార్యక్రమాలు-హిప్పీ కాంపులు, మార్ఫియాలు, మాధవీ చంద్రమ్మలు వాళ్ల విద్యార్థులపైకి చేసే ప్రయోగాలు. మిసెస్ అల్ఫ్రెడ్‌వంటివాళ్ళంతా ఇందులో క్రిష్టిన్‌కీలర్ పాత్రను నిర్వహించే వన్నెల విసనకర్రలు-ఈదేశంలోని 'క్రీమ్ ఆఫ్ ది సొసైటీ' విశ్వవిద్యాలయాలలో వుంది-అక్కడ అల్లర్లు లేపడం సమ్మెలు చేయించడం అరాజకాన్ని వ్యాపింపచేయడం వాళ్ళ లక్ష్యాలు. మేధావి వర్గాన్ని నిర్మూలిస్తే మిగిలిన అవిద్యావంతులనూ సామాన్య మానవులనూ వందల సంవత్సరాలు బానిసలుగా చేయడం శత్రువులకేంకష్టం? ఆ పద్మవ్యూహంలో నిష్కారణంగా చిక్కుకున్న బలహీనుడివి నువ్వు, కిరణ్‌కుమార్-ఇందులో నీ తప్పేమీ లేదని నాకు తెలుసు."

'చిదంబరరావు గారిని........'

'అరెస్టు చేశాము-కావాలంటే చూడవచ్చు నువ్వు-అంతేకాదు పచ్చపువ్వుల్లా కళ్ళు తెరుచుకుని ఈ పాపాలన్నిటినీ చూస్తున్న కమలమ్మ వురఫ్ చంద్రమ్మను

కూడా నువ్వు చూడవచ్చు-మీ విశ్వవిద్యాలయంవారు చాలా తొందరగానే మేల్కొన్నారు-కాబట్టే వారి సుహృద్భావంతో చాకచక్యంతో మేమీ విషవ్యూహాన్ని ఒక ఏడాదిలోగానే ఛేదించగలిగాము అందుకు వారికి మా. సి. బి. ఐ. అధికారులంతా కృతజ్ఞులం'

నటరాజన్ సి ఐ. డి. కాదు సి బి ఐ. అధికారి అన్నమాట!

నాకెందుకో దుఃఖం పొర్లు కొచ్చింది.

కాలుకింది భూమి కరిగిపోతున్నట్లు ఒక వైపూ, కారుమేఘాలు కదిలి పోతున్న ఆకాశం మరొక వైపూ కనిపించాయి-అనిపించాయి-

'చిదంబరరావుగారి మాహాత్మ్యాలు'... అనుమానంగా ప్రశ్నించాను

'చూడు కిరణ్-'లాల్ మాయాజాల్' ప్రదర్శన చూడలేదూ నువ్వు-ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'సర్కార్' పేరు వినే వుంటావుకదా! స్టేజీ మీద తలలూ మొండెమూ చేతులూ కాళ్ళూ వేటికవి ముక్కలు ముక్కలుచేసి ఆడియన్సు మీదికి విసిరేసి మళ్ళీ మరుక్షణంలోనే మనిషిని బ్రతికించి నడిపించేవాడు సర్కార్! సర్కార్ కన్నా గొప్ప వాడంటావా చిందబరరావు?'

తలతిరుగుతున్నట్లనిపించింది.

చేతితో గట్టిగా నుదురు పట్టుకొని ఒక్క క్షణం ఆగి తెప్పరిల్లాను-

జేబులో వున్న ఫోటో గుర్తుకొచ్చింది-

తీసి నటరాజన్ చేతికిచ్చాను-

చూచి నిట్టూర్చాడు 'పాపం కింగ్ జార్జిలో ఫేమస్ కార్డియాలజీస్టు ఇతను ప్రభుత్వ సహాయంతో హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ (గుండెలు తీసి కొత్తగుండెలు అమర్చడం)లో విప్లవం సాధిస్తానని ఛాలెంజి చేసిన మేధావి. ఇతనికిప్పుడు మతి భ్రమించింది. ఇతని గుండెపైనే విష ప్రయోగం జరిగింది. రాయవెల్లూరు పంపారు. మొన్న.'

'ఇన్నాళ్ళు మీరేంచేస్తున్నట్లు' ఆవేశంతో అరిచాను.

'దేనికైనా సమయం రావాలి కిరణ్. నిజం చెప్పాలంటే మన తెలుగు దేశంలో ఈ ఘోర ప్రమాదాన్ని మొగ్గలోనే త్రుంచివేశాము. కాని యితర విశ్వ విద్యాలయాల మాటేమిటి? విదేశీ విద్రోహుల ప్రేరణతో వ్యభిచార గృహాలుగా

మాతిన వుమెన్స్ హాస్టల్స్, మందుగుండు కర్మాగారాలుగా మారిన విద్యార్థుల గదులు-ఎన్ని వున్నాయో-ఇంకా ఎంత సమాచారం బయటికి రావాలో ఏమైతే నేం నువ్వుమాత్రం అదృష్టవంతుడివి కిరణ్-నిన్ను మధ్యాహ్నమే విడుదల చేస్తాము-వెళ్ళి, శ్రద్ధగా చదువుకో. మాకు కావాల్సిన వివరాలకొన్ని చెప్పివెళ్ల చాలు.'

నటరాజన్‌కు చెయ్యెత్తి నమస్కరించాను- నటరాజన్ నా గది దగ్గర నుండి వెళ్ళిపోయాడు.

అన్నట్లే మధ్యాహ్నానికి నన్ను వదిలి పెట్టారు.

అధికారులు అడిగిన అనేకమైన ప్రశ్నలకు ఏమీ దాచుకోకుండా జవాబులు చెప్పాను.

పోలీసు అధికారి చిరునవ్వు నవ్వుతూ 'చిదంబరరావు డైరీ దొరికింది' అని చెప్పి ఓ చిన్న పాకెట్ డైరీ తీసి అందులో నాలుగు కాగితాలు తిప్పి ఓ పేజీ నాకు చూపించాడు; అందులో "వెంకటరెడ్డి" అని మాత్రం వ్రాసివుంది ఇంగ్లీషులో-

"అంటే-" అయోమయంగా ప్రశ్నించాను.

'అంటే నీ తర్వాత ప్రయోగం అతని మీద నన్నమాట'.

నటరాజన్ ఒకేమాటలో వివరించారు దాని అర్థాన్ని!